Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 364 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 జనవరి 2024 మంగళవారం పేజీలు : 4

## హైదరాబాద్ వచ్చేసిన ఇంగ్లండ్ జట్టు.. 25 నుంచి..

హైదరాబాద్: ఇంగ్లండ్ క్రికెట్ టీం హైదరాబాద్ వచ్చేసింది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు హైదరాబాద్‌లో అడుగుపె ట్టింది. అబుదాబిలో దాదాపు నెల రోజుల క్యాంపు తర్వాత ఇంగ్లీష్ జట్టు నేరుగా హైదరాబాద్‌కు వచ్చింది. శంషాబాద్ విమానాశ్ర యంలో అడుగుపెట్టిన ఇంగ్లండ్ ఆటగాళ్లకు సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం లభించింది. మరోవైపు ఆటగాళ్లను చూడడానికి అభిమానులు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. హలో హైదరాబాద్.. ఇది ముత్యాల నగరం అంటూ రాసుకొచ్చింది.

కాగా భారత్, ఇంగ్లండ్ మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే మొదటి టెస్ట్ మ్యాచ్ ఈ నెల 25 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గల రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ప్రారంభంకానుంది.





# రాములోరు వేంచేశారు....!

## చారిత్రక ఘట్టం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ - మోదీ భావోద్వేగం..!!

అయోధ్యలో చారిత్రక ఘట్టం ప్రారంభమైంది. దశాబ్దాల కల నెరువేరుస్తూ బాలరాముడికి అయోధ్య ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేసారు. ముందుగా నిర్ణయించిన అభిజిత్ లగ్నం వేళ ప్రధాని మోదీ ఈ చారిత్రక ఘట్టం లో భాగస్వాములయ్యారు. కార్యక్రమ నిర్వహణ వేళ ప్రధాని మోదీ ఉద్వేగానికి లోనయ్యారు. కోట్లాది మంది కల నెరువేరుస్తున్న వేళ యావత్ దేశం రామ నామంతో హోరెత్తింది. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ఈ చారిత్రక ఘట్టానికి ప్రత్యక్షంగా తరలి వచ్చారు. దేశం మొత్తం అయోధ్య వైపు చూస్తున్న వేళ చారిత్రాత్మక ఘట్టం పూర్తయింది. అయోధ్య అంతా రామ మయంగా మారింది. రామ నామంతో దేశం హోరెత్తుతోంది. అయోధ్యలో అపూర్వ ఘట్టం చూసేందుకు అంతర్జాతీ, జాతీయ ప్రముఖులు అయోధ్యకు తరలి వచ్చారు. అందరూ రామ నామం జపిస్తున్న వేళ ప్రధాని మోదీ ఆలయ ప్రాంగణంకు చేరుకున్నారు. ముందుగా రామ్ లల్లా విగ్రహాలకు పూజలు చేసారు. ఆ తరువాత మూల విరాట్ వద్ద ప్రధాని మోదీతో పాటుగా ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్, సీఎం యోగీ, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, రామ్ తీర్ధ ట్రస్ట్ అధ్యక్షులు గర్భగుడిలో ప్రధాన పూజలో పాల్గొన్నారు. నిర్ణయించిన ముహూర్తాన బాల రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసారు.

ఈ ముహూర్తాన దేశం నలుమూలలా రామ నామం పటిస్తూ భక్తులు ఉద్వేగానికి లోనయ్యారు. బాలరాముడి తొలి దర్శనం వేళ ప్రధాని మోదీ ఉద్వేగానికి లోనయ్యారు. 11 రోజులుగా దీక్షలో ఉన్న ప్రధాని మోదీ రాముడికి తొలి పూజలు చేసా రు. ఎక్కడ చూసినా జై శ్రీరాం అని రాసి ఉండడంతో పాటు రామ భజనలు, కీర్తనలతో అయోధ్య మారుమోగుతోంది. ఆలయాన్ని పూర్తిగా విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. రాత్రిళ్లు బంగా రు వర్ణంలో గుడి వెలిగిపోతోంది. బయట గేటు దగ్గర కూడా పూలతో అలంకరించారు. ప్రధాన రహదారి నుంచి గుడికి వెళ్లే దారిలో పది అడుగుల ఎత్తు వరకు పూలతో అలంకరించారు. ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా అయోధ్యలో ఏర్పాటు చేసిన లేజర్ షో అందరిని ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు, భారీ సంఖ్యలో మోహరించిన భద్రతా బలగాలతో అయోధ్య సందడిగా కనిపిస్తోంది. రఘుపతి రాఘవ రాజారాం పఠిస్తూ భక్తులు పారవశ్యంతో కనిపించారు. అయోధ్య పట్టణం మొత్తం రామ మయంగా మారిపోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని కోట్లాది మంది టీవీల ద్వారా వీక్షించారు.

# 1528 - 2024... అయోధ్యలో కొన్ని కీలక ఘట్టాలు!

ఈరోజు అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అయోధ్య ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అయితే 1528 లో ప్రారంభమైన అయోధ్య రామ మందిర వివాదంలో.. నేటి ప్రారంభోత్సవం వరకూ ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా అసలు 1528లో ఈ వివాదం ఎలా మొదలైంది.. 2019లో ఎలా ముగిసింది.. ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలేమిటి అనేది ఇప్పుడు చూద్దాం! అవును... 1528 లో నాడు మొఘల్ చక్రవర్తుల పరిపాలన కాలంలో అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మాణానికి.. అప్పటి చక్రవర్తి బాబర్ పాలనలో కమాండర్‌గా ఉన్న మీర్ బఖి ఆదేశాలు జారీ చేశారు. అయితే నాడు బాబ్రీ మసీదు నిర్మించిన చోటే.. శ్రీరాముడి జన్మస్థలం అని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో... ప్రధానంగా 1843 నుంచి 1949 వరకు మసీదు చుట్టూ అనేక వివాదాలు నెలకొన్నాయి. మతపరంగా ఎన్నో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగా... 1853, 1859 లో ఈ ప్రాంతంలో మతపరమైన ఘర్షణలు తార స్థాయికి చేరాయి. దీంతో నాడు బ్రిటీష్ ప్రభుత్వం.. అయోధ్యలో ఉన్న వివాదాస్పద భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసింది. అనంతరం... మసీదు లోపలి భాగంలో ముస్లింలు, వెలుపలి భాగంలో హిందువులు ప్రార్థనలు, పూజలూ చేసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. అప్పటికి ఆ వివాదానికి అలా టెంపరరీ పరిష్కారం చూపించింది ఇంగ్లిష్ ప్రభుత్వం!! ఇక స్వతంత్ర భారతదేశంలో 1949 సెప్టెంబర్ 23న అయోధ్య వివాదం మరోసారి పీక్స్ కి చేరింది. ఇందులో భాగంగా... మసీదు లోపల రాముడి విగ్రహాలను గుర్తించినట్లు చెప్పడం అప్పట్లో సంచలనంగా మారింది. దీంతో మత ఘర్షణలు జరుగుతాయేమో అన్న భావనతో.. మసీదు లోపలి నుంచి విగ్రహాలను తొలగించాలని అప్పటి ఉత్తర



ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది! ఈ నేపథ్యంలో 1950 లో ఫరీదాబాద్ సివిల్ కోర్టులో 2 పిటిషన్లు దాఖలయ్యాయి. మరోపక్క 1961లో మసీదులోపల ఉన్న విగ్రహాలు తొలగించాలని, అనంతరం వివాదాస్పద భూమిని తమకు అప్పగించాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డు కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే అనంతర పరిణామాల్లో భాగంగా... 1986లో వివాదాస్పద భూమికి ఉన్న తాళాలను తీసేసి, హిందువులు ప్రార్థనలు చేసుకోవచ్చని తెలిపారు. ఇలా అప్పటివరకూ జరిగిన వివాదాలు ఒకెత్తు అయితే.. తర్వాత 1992 లో జరిగిన ఘటన మరొకెత్తు. ఇందులో భాగంగా... 1992 డిసెంబర్ 6న విశ్వహిందు పరిషత్, శివసేన కార్యకర్తలు.. వివాదాస్పద భూమిలోకి చొచ్చుకెళ్లి అక్కడున్న బాబ్రీ మసీదు కట్టడాన్ని ధ్వంసం చేశారు. నాడు ఆ ఘటన దేశవ్యాప్తంగా అత్యంత సంచలనంగా మారింది. ఈ సమయంలో... దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న అనేక చోట్ల మత ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన తర్వాత 2002లో గుజరాత్ లో గోద్రా అల్లర్లు జరిగాయి. ఆ తర్వాత 2010లో అలహాబాద్ హైకోర్టు ఈ వివాదాస్పద భూమిని 3 భాగాలుగా విభజిస్తూ తీర్పు వెలువరించింది. ఇందులో భాగంగా ఆ 3 భాగాలనూ... సున్నీ వక్ఫ్ బోర్డు, రామ్ లల్లా విరాజ్మాన్, నిర్మోహి అఖారాలకు పంచుతూ నిర్ణయం తీసుకుంది. దీన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయగా.. 2011లో ఈ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో 2011 - 2016 మధ్య అయోధ్య వివాదం చుట్టూ అత్యున్నత న్యాయస్థానంలో అనేకమార్లు విచారణ జరిగింది. ఈ క్రమంలో చివరగా 2017లో ఔట్ ఆఫ్ కోర్ట్ సెటిల్మెంట్ కోసం సుప్రీంకోర్టు పిలుపునిచ్చింది. అయినా ఫలితం రాకపోవడంతో 2019 మార్చి 8న అయోధ్య వివాదాస్పద భూమికి పరిష్కారం కోసం 8 వారాల గడువు ఇస్తున్నట్టు ప్రకటించింది! అయితే ఆ మధ్యవర్తిత్వం ద్వారా కూడా ఎలాంటి పరిష్కారం లభించలేకపోవడంతో... 2019 ఆగస్ట్ 2న సుప్రీంకోర్టుకు మీడియేషన్ ప్యా నెల్ నివేదికను అందించింది. ఈ క్రమంలో 2019 నవంబర్ 9న ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత ధర్మాసనం.. అయోధ్య వివాదాస్పద భూమిపై చారిత్రక తీర్పును వెలువరించింది. ఇందులో భాగంగా... 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని రామ మందిర నిర్మాణానికి, మరో 5 ఎకరాలను మసీదు నిర్మాణానికి అప్పగిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. దీంతో... 2020 ఆగస్ట్ 5న.. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.




అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా కొనసాగింది. 'జై శ్రీరామ్' నినాదాలతో అక్కడి వీధులన్నీ మార్మోగుతున్నాయి. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు రామ మందిరం వద్దకు చేరుకున్నారు. తెదేపా అధినేత చంద్రబాబు, ప్రముఖ సినీ, క్రీడా ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, రామ్‌చరణ్, పీటీ ఉష, అమితాబ్‌బచ్చన్, అనిల్‌కుంబ్లే, జాకీ ష్రాఫ్, రామ్‌దేవ్ బాబా తదితరులు వచ్చారు.




# మోదీ సక్సెస్ మంత్ర

## 370, ట్రిపుల్ తలాక్, రామాలయం పూర్తి - ఇక, మోడీ నెక్స్ట్ గురి ఎటో!?

దేశ చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం అయింది. కోట్లాది ప్రజల సుదీర్ఘ కల నెరవేరింది. రాజకీయంగా విమర్శలు ఎలా ఉన్నా..ఈ క్రెడిట్ మోదీ ఖాతాలో జమ అవుతోంది. ప్రధానిగా మోదీ రెండో సారి గెలిచిన సమయం నుంచి బీజేపీ దేశంలో తీసుకురావాలని భావించిన మార్పులు..లక్ష్యాలను మోదీ ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారు. అందులో ఇప్పటికే కొన్నింటిని సాధించారు. ఇప్పుడు రామాలయం పూర్తి అయింది. ఇక, మోదీ తదుపరి లక్ష్యం ఏంటో స్పష్టం అవుతోంది. మోదీ వరుస విజయాలు: బీజేపీ తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ దశాబ్దాల కాలంగా తమ అజెండా ప్రకటిస్తూ వచ్చింది. కానీ, పూర్తి మెజార్టీ బీజేపీకి దక్కలేదు. మోదీ తొలి సారి ప్రధాని అయిన తరువాత పూర్తిగా పట్టు సాధించేందుకు, దేశ ఆర్ధిక వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యత ఇచ్చారు. 2019లో అధికారంలోకి వస్తూనే పార్టీ లక్ష్యాలను..సుదీర్ఘ సంక్లిష్ట అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వచ్చారు. అందులో భాగంగా ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ కేంద్రం చట్టం చేసింది. దీని పైన కొన్ని అభ్యంతరాలు వచ్చినా.. అనూహ్యంగా ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రంలో ఆ నిర్ణయం బీజేపీకి కలిసి వచ్చింది. ఇక, జమ్ము కాశ్మీర్ లో ఆర్టికల్ 370డీ రద్దు అంశాన్ని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెర మీదకు తీసుకొచ్చింది. ముందుగా జమ్ము కాశ్మీర్ లో పరిస్థితిని తమ అదుపులోకి తెచ్చుకుంది.

**సుదీర్ఘ కాల సమస్యలకు పరిష్కారం:** ఆ తరువాత పార్లమెంట్ లో 370 మార్పు ద్వారా జమ్ము కాశ్మీర్ కు స్వయం ప్రతిపత్త హోదా రద్దుకు ఆమోదం తెలిపింది. భారత్ లో భాగమని విస్పష్ట ప్రకటన చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనే జమ్ము కాశ్మీర్ కు రాష్ట్ర హోదా కల్పించే క్రమంలో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు సిద్దం అవుతోంది. ఇక, యూసీసీ అంశం పైన కసరత్తు చేసింది. ఇక...అయోధ్యలో రామజన్మభూమి వివాదం పైన సుప్రీం కోర్టులో తీర్పు వస్తూనే..మోదీ వేగంగా అడుగులు వేసారు. 2020 ఆగస్ట 5న రామాలయంకు భూమి పూజ చేసారు. మెజార్టీ హిందు ఓటింగ్‌ను ఆకర్షించేలా కాశీలో మార్పులు చేసారు. సరి కొత్త ఆధ్యాత్మిక నగరిని నిర్మించారు. అయోధ్యలో ఆలయ నిర్మాణ బాధ్యతలు కోర్టు సూచనల మేరకు ట్రస్టుకు అప్పగించారు. యూపీ సీఎం యోగి రామాలయం నిర్మాణంలో స్థానిక రాష్ట్ర ప్రభుత్వాధినేతగా కీలకంగా వ్యవహరించారు. 2024 ఎన్నికలకు ముందే పూర్తి చేయాలనే సంకల్పంతో పని చేసారు. యావత్ దేశం అయోధ్య వైపు చూసేలా ఈ ఆలయం ప్రాంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

మోదీ నెక్స్ట్ టార్గెట్: 2024 ఎన్నికలకు ముందే పూర్తి చేయాలనే సంకల్పంతో పని చేసారు. యావత్ దేశం అయోధ్య వైపు చూసేలా ఈ ఆలయం ప్రాంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.అయోధ్య రామాలయం పైన ప్రతిపక్షాల విమర్శలు ఎలా ఉన్నా..మోదీ సక్సెస్ రేట్ పెరిగింది. ఇక..బీజేపీ స్థాపించిన నాటి నుంచి మరో కీలక లక్ష్యం పెండింగ్ లో ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో అంతర్భాగం చేయటం. గతంలో పుల్వామా లో భారత్ సైనికులపై దాడుల తరువాత మోదీ ప్రభుత్వం పాక్ ఉగ్రవాద శిబిరాల పైన సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. మోదీ వరుసగా మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలనే లక్ష్యం వేళ పీఓకే పైన ఏం చేస్తారు..అదే తరువాతి టార్గెట్ కాబోతుందా అనే చర్చ మొదలైంది. మోదీకి అంతర్జాతీయ స్థాయిలోనూ అనూహ్య మద్దతు లభిస్తోంది. కానీ, చైనా వంటి పొరుగు దేశాలతో సమస్యలు ఉన్నాయి. ఈ సమయంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో మోదీ మంత్రాంగం..రాజ తంత్రం ఎలా ఉంటుందనేది చూడాలి. మూడో సారి అధికారం ఖాయమని భావిస్తున్న వేళ మలి విడత ప్రభుత్వంలో నిర్ణయాలు ఉంటాయా అనే చర్చ వేళ..రానున్న రోజుల్లో ఆసక్తి కరంగా మారుతోంది.

# సంపాదకీయం

## లాజిక్ మిస్సయ్యితే ఎలా రావు గారు ?

పాపం ఓటమి దెబ్బకు ఏమి మాట్లాడుతున్నారో కూడా బీఆర్ఎస్ నేతలకు తెలుస్తున్నట్లు లేదు. గజ్వేలులో హరీష్ రావు ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ జరిగింది. ఈ సభలో హరీష్ మాట్లాడుతూ గజ్వేల్ లో కేసీయార్ ను ఓడించేందుకు అనేక కుట్రలు జరిగినట్లు ఆరోపించారు. అయితే ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీయార్ భారీ మెజారిటితో గెలిచిన విషయాన్ని మాజీమంత్రి గుర్తుచేశారు. కేసీయార్ ను ఓడించేందుకు రెండు జాతీయ పార్టీలు పనిచేసినట్లు తెగ ఫీలైపోయారు. ప్రాంతీయ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ ను కేసీయార్ జాతీయ పార్టీ బీఆర్ఎస్ గా మార్చిన విషయాన్ని హరీష్ మరచిపోయారేమో. ఇక్కడే హరీష్ మాటల్లోని డొల్లతనమంతా బయటపడింది. ఒక నియోజకవర్గంలో ముగ్గురు పోటీచేసినపుడు ముగ్గురు కూడా ఒకళ్ళకి మరొకళ్ళు ప్రత్యర్ధులే కదా. అప్పుడు ప్రతి ఒక్కళ్ళు మరొకరిని ఓడించేందుకు ప్రయత్నం చేసుకోవటం చాలా సహజం. ఇందులో కుట్ర ఏముందో హరీష్ కే తెలియాలి. గజ్వేలులో కేసీయార్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్ధులు కూడా పోటీచేశారు. చివరి నిముషం వరకు గెలుపు కోసమే ప్రయత్నాలు చేసుకున్నారు. ట్రయాంగిల్ పోటీలో కేసీయార్ గెలిచారంతే. ఇందులో పై రెండు పార్టీలు చేసిన కుట్రేమున్నది ? గెలుపుకోసం కాకపోతే అభ్యర్ధులు ఓడిపోవటానికి పోటీచేస్తారా ? భారీ మెజారిటితో కేసీయార్ గెలిచారని హరీష్ చెప్పింది నిజమే. అయితే కేసీయార్ ఓడిపోయిన కామారెడ్డి సంగతి ఎందుకు ప్రస్తావించలేదు ? ఎన్నికల్లో గెలుపోటములు చాలా సహజం. అంతేకానీ తాము గెలిస్తే గొప్పన్నట్లు ఓడిపోతే ప్రత్యర్ధులు కుట్రచేశారని అనటం అవివేకం. సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉన్న హరీష్ కూడా కేసీయార్ ను ఎన్నికల్లో ఓడించటానికి కుట్ర జరిగిందని ఆరోపించటమే విచిత్రంగా ఉంది. ప్రత్యర్ధులను ఓడించటం కుట్ర ఎలాగవుతుందో హరీషే చెప్పాలి. గెలుపుకోసం ఎవరికి అందుబాటులో ఉన్నా మార్గాల్లో వాళ్ళు ప్రయత్నాలు చేసుకుంటారని హరీష్ కు తెలీదా ? ఓటమి దెబ్బ కేసీయార్, కేటీయార్ తో పాటు హరీష్ మీద కూడా బాగానే ప్రభావం చూపుతున్నట్లుంది. అందుకనే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు. గజ్వేలులో ప్రత్యర్ధులపై కుట్రలు చేసే కేసీయార్ గెలిచారని ఎవరైనా రివర్సులో ఆరోపిస్తే హరీష్ అంగీకరిస్తారా ?

## శతాబ్దాల కల నెరవేరడంతో వాడ వాడ ఊరు ఊరున రామ నామస్మరణతో మారుమోగాయి....

### అలియాబాద్ రామాలయంలో వేల సంఖ్యలో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు...







శామీర్ పేట, (గరుడ వార్త): అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్టాపన జరగటంతో ప్రజలు పట్టణ గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తూముకుంట మున్సిపాలిటీ షామీర్పేట మూడు చింతలపల్లి మండల పరిధిలోని పట్టణ గ్రామాల్లో లోని రామాలయాలు తో పాటు వివిధ ఆలయాల్లో శ్రీరాముడికి కల్యాణోత్సవం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయాలను పూలతో సుందరంగా అలంకరించుకొని ఆయా స్వామివార్లకు పూజలు చేశారు. గ్రామాలలోని మహిళలు పిల్లలు ఎంతో భక్తిశ్రద్ధలతో వారి వారి ఇళ్ళను శుద్ధి చేసుకుని మామిడి తోరణాలు పెట్టుకొని ఇళ్లలో శ్రీరామ నామాన్ని స్మరిస్తూ పూజలు జరిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు రామనామ స్మరణతో మారుమోగాయి. బాల రాముని ప్రతిష్ట మహోత్సవాన్ని ఆలయాలలో ఏర్పాటుచేసిన పెద్ద టీవీలలో చూస్తూ కరిచిపోయారు. రాత్రికి ఇళ్లలో దీపాలను వెలిగించి స్వామి వారిని స్మరించుకున్నారు. అలియాబాద్ గ్రామంలోని ప్రస్తుత గాంచిన రామాలయంలో స్వామివారి కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు ఇక సాయంత్రం వందలాది మంది భక్తులు వేలాది దీపాలు అలియాబాద్ రామాలయంలో వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు అనంతరం అలియాబాద్ శ్రీ స్వామివారి శోభాయాత్రను అలియాబాద్ గ్రామంలో నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లో ఆదివారం తెల్లవారు జామున సోమవారం తెల్లవారుజామున భక్తులు రామనామాన్నిస్మరిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేటలో స్వామి వారి ఉత్సవ విగ్రహ మూర్తులతో వీరభద్ర స్వామి ఆలయం నుంచి



రామాలయం వరకు పెద్ద ఎత్తున భక్తులు నృత్యాలు చేస్తూ స్వామివారిని ఊరేగించారు. రామాలయంలో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే తూముకుంట పరిధిలోని శ్రీ విజ్ఞాన భారతి పాఠశాలలో బాల రామ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా కరస్పాండెంట్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి శామీర్ లోని అన్ని గ్రామాలలో శోభాయాత్రలు నిర్వహించారు.

## జీవో 317 ను గత ప్రభుత్వం విస్మరించింది



హైదరాబాద్ : జీవో నంబర్ 317 వల్ల ప్రభుత్వ ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు ఇబ్బంది పడింది వాస్తవమేనని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మన పనిని తొందరగానే పూర్తి చేసుకోవాలని... కానీ తెగదింపులు చేసుకోవద్దని చెప్పారు. ఈ జీవో పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని గత ప్రభుత్వం సమస్యను విస్మరించింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని మీకు న్యాయం జరుగుతుందని తెలిపారు. స్థానికత మా జన్మ హక్కు అంటూ జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వం మా సమస్యను గుర్తించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకు అభినందన కృతజ్ఞత సభ నిర్వహించింది. ఈ సమావేశానికి హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఒక్క కొత్త జిల్లాలో అదనపు మండలాలు చేర్చడం వల్ల స్థానికత సమస్య వచ్చి పడిందని ఈ జీవో వల్ల ఎక్కువ శాతం నష్టపోయింది ప్రభుత్వ టీచర్లే అని అన్నారు. అలకేషన్ సీలింగ్ అనేది తీసివేస్తే న్యాయం జరుగుతుందన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధిగాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 317 పై ఎన్నిసార్లు పోరాటం చేసిన గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉద్యోగులు ఉపాధ్యాయులను అన్యాయం చేసిందని విమర్శించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం దురుద్దేశంతోనే జీవో 317 ను తీసుకువచ్చిందని దీనివల్ల ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు తమ స్థానికతను కోల్పోయి నష్టపోతున్నారని తెలిపారు. అప్పుడు ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు హక్కుల కోసం అండగా ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవో పై కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టినట్లే జూన్ 2 లోగా ఉద్యోగస్తులు ఉపాధ్యాయులకు స్థానికత లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సెక్రటరీ దత్తాద్రి, చంద్రమౌళి,విట్టల్ ,సూర్య మల్లేష్, సందీప్, మధుసూదన్, ప్రవీణ్, వినోద, హారతి, చాముండేశ్వరి, రత్నమాల, సూర్య కళ తోపాటు వివిధ జిల్లాల నుండి ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ మల్లికార్జున స్వామి జాతర

శామీర్ పేట, (గరుడవార్త): కన్నుల పండుగగా శ్రీ మల్లికార్జున స్వామి జాతర జరిగింది. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి జాతర యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అగ్నిగుండాలు తొక్కి గొలుసులు తెలిపారు.



సాయంత్రం గ్రామస్తులు, భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం కొరకే పోస్టల్ సేవలు...

### పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

శామీర్ పేట, (గరుడ వార్త): కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న పోస్టల్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం6 చేసుకోవాలని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ శ్రీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట లోని సబ్ పోస్ట్ ఆఫీస్ ను ఆయన సందర్శించి ప్రజలకు అందజేస్తున్న సేవలను పరిశీలించారు. పోస్ట్ ఆఫీస్ లో ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన ఆధార్ సేవలను ఆయన పరిశీలించి వినియోగ



దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా ఎన్నో సంక్షేమ పథకాలను, సేవలను అందిస్తుందని చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్, పోస్ట్మాస్టర్ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "లింబో" చిత్రం ఆడియో రిలీజ్..

హైదరాబాద్ :సినిమా కొన్ని శతాబ్దాలుగా ప్రేక్షకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తోందని సినీ దర్శకులు మహేష్ చంద్ర పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌనుహాలు లో క్లాసికల్, వెస్ట్రన్ డాన్స్, సింగింగ్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ కు 'సేవారత్న' అవార్డు, స్వర్ణ అలర్జీ చెస్ట్ కేర్ సెంటర్ డాక్టర్ కె.పెంచలరెడ్డికి 'వైద్యరత్న' అవార్డుతో ఘనంగా సత్కరించారు. 25 కళా సంఘాల గౌరవాధ్యక్షులు అమరావతి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ




నెల్లూరు కళలకు పుట్టినిల్లు. కళల పట్ల అభిరుచి కలిగి ఉండాలని, లింబో చిత్రం ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అనంతరం ఎస్.వి.ఎస్.క్రియేషన్స్ లింబో చిత్రం ఆడియోను దర్శకుడు చంద్రమహేష్, సినీ హీరో ఓంకార్ వర్మ, అమరావతి కృష్ణా రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి, షేక్ షబ్బీర్, తలారి వెంకటయ్య,చీదరాల చెన్నయ్య, షేక్ రియాజ్ బాషా, అందే శ్రీనివాసులు, ఆర్.అలేఖ్య, రవి గోగులపల్లి, రాచపాలెం రఘు, సినీ నటులు రూప రెడ్డి, దర్శకులు సుధాకర్ రెడ్డి, మురళీమోహన్ రాజు, నిర్మాత కె.శైలజ, గాయకులు అశోక్, ప్రవళిక, గేయ రచయిత సుందర రాజా రెడ్డి, కెమెరా మెన్ ఎ.వెంకటేష్, కో-డైరెక్టర్ కె.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పాస్ పుస్తకాలతో కొట్టేశారా..?

హైదరాబాద్: శివారు ప్రాంతాల్లోని సర్కార్ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ధరణిలో పేర్లు నమోదు చేయించుకున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో అక్రమాలను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్‌లో భూముల వివరాలు సక్రమంగా లేవని, తమ స్థలాలను వేరే వ్యక్తుల పేర్లతో అధికారులు నమోదు చేశారంటూ రైతులు, భూ యజమానులు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లకు ప్రతి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. వీటిని పరిగణలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు అక్రమాలపై విచారించాలంటూ ఆదేశించారు. దీంతో హైదరాబాద్ శివారులోని రెవెన్యూ డివిజన్లు, గ్రామాలవారీగా అధికారులు రికార్డులను పరిశీలించనున్నారు. తొలుత ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు.. తర్వాత పాస్‌పుస్తకాలను అధ్యయనం చేయనున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన పాస్‌పుస్తకాలను, ఆయా భూయజమానుల వివరాలను తీసుకొని.. వారికి అవి ఎలా వచ్చాయనే వివరాలను సేకరించనున్నారు.

మూడేళ్ల రికార్డులు..

ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు పాస్‌పుస్తకాలను రూపొందించిన వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు మూడేళ్ల నాటి రికార్డులను తీసుకుంటున్నారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏఏ మండలాల్లో ఎక్కువ ఫిర్యాదులొచ్చాయి?..అవి ఎందుకు పరిష్కారం



కాకుండా ఉన్నాయనే అంశాలపై దృష్టి సారించనున్నారు. మహేశ్వరం, కందుకూరు, శేరిలింగంపల్లి మండలాల్లో ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ముఖ్యంగా శేరిలింగంపల్లి మండలంలో ప్రభుత్వ భూములను ఎకరాలకొద్దీ ఆక్రమించుకున్నారని ఫిర్యాదులు అందాయి.

రెవెన్యూ చట్టంలోని లొసుగుల వల్ల..

రెవెన్యూ చట్టంలోని కొన్ని లొసుగుల కారణంగా అక్రమంగా పాసుపుస్తకాలు తీసుకున్నవారిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు కొన్ని మండలాల్లో ప్రభుత్వం జారీచేసిన పాసుపుస్తకాలను పరిశీలించనున్నారు. వారి వద్దే పాస్‌పుస్తకాలున్నాయా?.. ఇంకెక్కడైనా ఉన్నాయా?.. తెరవెనుక స్థిరాస్తి వ్యాపారులుండి.. తెరముందు బలహీనులున్న సంఘటనలు.. పాస్‌పుస్తకాల్లో ఫొటోలు, పేర్లు మాత్రమే ఉండి... ఆ పేరు గల వ్యక్తులు లేని ఘటనలపై సమాచారం తెలుసుకోనున్నారు. అక్రమాలు, వాటికి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టనున్నామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

# ఈసారీ..ఆదుకోని సుంకిశాల

హైదరాబాద్: నాగార్జునసాగర్‌లోని నీటి మట్టాలు తగ్గినప్పుడు... డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతేడాది మే నాటికి ప్రాజెక్టు సిద్ధం చేయాలని లక్ష్యం కాగా.. ఇప్పటివరకు కేవలం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని భావిస్తున్నా.. ప్రస్తుత పనుల తీరును చూస్తే సాధ్యం కాదని అంటున్నారు. దీంతో గుత్తేదారు సంస్థకు నోటీసులు ఇచ్చేందుకు జలమండలి సిద్ధమవుతోంది. నాగార్జునసాగర్‌లోని డెడ్ స్టోరేజీ నుంచి నీటిని నగరానికి తరలించడానికి గత ప్రభుత్వం రూ.1,450 కోట్లతో సుంకిశాల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే.ఈ ఏడాది కృష్ణా పరివాహక ప్రాంతాల్లో అనుకున్న స్థాయిలో వానలు కురవక పోవడంతో సాగర్‌లోకి అంతంత మాత్రంగానే వరద చేరింది. నగర తాగునీటి అవసరాలకు ఈ ప్రాజెక్టు కీలకం. నిత్యం 290 ఎంజీడీలు సాగర్ నుంచే తరలిస్తున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 312 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 153.5 టీఎంసీలకు పడిపోయింది. 590



అడుగులకు గానూ...ప్రస్తుతం 522 అడుగుల వరకు నీటి మట్టం ఉండగా...510 అడుగుల వరకు ఎలాంటి పంపింగ్ లేకుండా నగరానికి నీటిని తరలించవచ్చని జలమండలి అధికారులు చెబుతున్నా రు. సాగునీటికి వినియోగం, ఆవిరిశాతం పరిగణనలోకి తీసుకుంటే... వేసవి నాటికి నీటి మట్టాలు మరింత అడుగుకు చేరే అవకాశం ఉంది. అత్యవసర పంపింగ్ చేపట్టినా...డెడ్‌స్టోరేజీ వరకు మాత్రమే నగరానికి నీటిని తరలించవచ్చు. ఆ తర్వాత కూడా కావాలంటే సుంకిశాల ప్రాజెక్టే దిక్కుకానుంది.

ప్రాజెక్టు వ్యయం పెంచినా..తొలుత సుంకిశాల నిర్మాణ వ్యయం రూ.1450 కోట్లుకు ప్రతిపాదించారు. పనుల్లో జాప్యం, ఇతరత్రా కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.2,200 కోట్లుకు చేరింది. పూర్తిగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనుల్లో సర్జ్‌పూల్(భారీ బావిలాంటి నిర్మాణం) పనులు కొనసాగుతున్నాయి. ఇక్కడ నుంచి దాదాపు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదండపూర్ వరకు భారీ గొట్టాల నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని తెలుస్తోంది. సాగర్‌లో నీటి మట్టాలు ఇంకా తగ్గితే మరోసారి అత్యవసర పంపింగ్ తప్పదని అధికారులు అంటున్నారు. ఇందుకు మరోసారి రూ.10 కోట్లకు పైనే వెచ్చించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

# ఆంధ్రా నుంచి అక్రమంగా..!



కోదాడ : కోదాడ నియోజకవర్గం మీదుగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తుండగా, ఆంధ్ర నుంచి గంజాయిని కోదాడ మీదుగా హైదరాబాద్ సహా ఇతర రాష్ట్రాలకు తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. వీటికి మరో అక్రమ వ్యాపారం తోడైంది. ఆంధ్ర నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ కోదాడ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుంటున్నారు. కృష్ణానది తీర ప్రాంతం సమీపంలో ఉండటంతో అక్కడి నుంచి ఇసుకను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఈ ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ జిల్లా వాసులు రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతమైన భద్రాచలం నుంచి సాధారణంగా ఇసుక కొనుగోలు చేసేవారు. ఈ ఇసుకను కొనుగోలు చేయాలంటే ప్రభుత్వానికి చలానాలు చెల్లించాల్సి వస్తుంది. ఆ చలానాలు చెల్లించకుండా ఆంధ్ర నుంచి అక్రమంగా తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వ అధికారులు తోడవ్వడంతో ఇసుక దందా జోరుగా కొనసాగుతోంది.

సరిహద్దు గ్రామాల మీదుగా..

సాధారణంగా ఆంధ్ర నుంచి ఇసుక రావాలంటే జాతీయ రహదారిపై రామాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు మీదుగా రావాల్సి ఉంది. ఇక్కడ తనిఖీలు చేస్తారనే భయంతో సరిహద్దు గ్రామాలను ఎంచుకుంటున్నారు. ఇటు అనంతగిరి మండలంలోని సరిహద్దులోని కొన్ని గ్రామాలు, కోదాడ మండలంలోని కొన్ని గ్రామాల మీదుగా ఇసుక వాహనాలను రాత్రి పూట తరలిస్తున్నారు. కోదాడ రూరల్ గ్రామాల నుంచి మేళ్లచెరువుకు వెళ్లే రహదారి మీదుగా పట్టణంలోకి ప్రవేశిస్తారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వరకు ఇసుక రవాణా జరుగుతోంది.

కొరవడిన పర్యవేక్షణ

అక్రమంగా ఇసుక తరలిపోతుంటే పోలీసు, మైనింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు ముందుగానే అధికారులకు ఇవ్వాల్సిన కానుకలు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ అక్రమంగా ఇసుక వ్యాపారం ఎవరు చేస్తున్నారో వారికి తెలిసినా చర్యలు తీసుకోరనే ఆరోపణలు ఉన్నాయి. కానుకలు ఇవ్వకపోతే వెంటనే వాహనాలను పట్టుకుంటారని ఇసుక వ్యాపారులే చెబుతుండటం గమనార్హం.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఇసుక కొనుగోలు చేస్తే ప్రభుత్వానికి ఛలానా రూపంలో కొంత చెల్లించాల్సి ఉంటుంది. ఆంధ్ర నుంచి ఇసుక రావడంతో దాని ప్రభావం ప్రభుత్వ ఖజానాపై పడుతోంది. నిత్యం పదుల సంఖ్యలో లారీలను పట్టుకున్నా, ఇక్కడి అధికారులు అంతంతమాత్రంగానే కేసులు నమోదు చేసి వాహనాలను వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరిస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రాహుల్ హెగ్డే, జిల్లా ఎస్పీ, సూర్యాపేట

సరిహద్దు నుంచి ఇసుక రవాణాకు అనుమతులు లేవు. నిబంధనలు అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా చర్యలు తీసుకుంటున్నాం. చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాం. ప్రభుత్వ పథకాలకు మాత్రమే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతి ఉంటుంది. దానికి అనుమతి తీసుకుంటున్నారు.

# తలరాత మార్చుకో..!




కోదాడ : ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి, పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థి జీవితంలో ఈ పరీక్షలు అత్యంత కీలకమైనవి. పరీక్షల్లో రాణించాలంటే పుస్తకాలపై పూర్తి స్థాయి అవగాహనతో పాటు దస్తూరికి (చేతిరాత) అత్యంత ప్రాధాన్యముంది. సాధారణంగా పది, ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలంటే కొంత ఆందోళనతో పాటు భయం ఉంటుంది. ఈ క్రమంలో వారికి ప్రశ్నకు సమాధానం తెలిసినా రాత సరిగా రాయకపోవడంతో సరైన మార్కులు పొందలేరు. విద్యార్థుల చేతిరాత వారి మార్కులను, గ్రేడ్లను నిర్ధారిస్తుంది. రాత స్పష్టంగా, గుండ్రంగా ఉంటే పేపర్ దిద్దే ఉపాధ్యాయులకు స్పష్టత ఏర్పడి జవాబుకు పూర్తి మార్కులు వేసే వీలుంటుంది. ఆంగ్లానికి సంబంధించి కలిపి రాతలో ఆయా అక్షరాల క్రమం ఎత్తు, పల్లాల విషయంలో సరైన క్రమం పాటించకపోవడం వంటి కారణాలతో విద్యార్థులు రాసిన జవాబుకు తక్కువ మార్కులు వేసే ప్రమాదముంటుంది. ఈ క్రమంలో విద్యార్థులు చేతిరాతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయుల సలహాలు.

పాటించాల్సిన జాగ్రత్తలు

చేతిరాతను మెరుగుపరుచుకునేందుకు నిత్యం సాధన చేయాలి నాణ్యత గల పెన్నులనే ఉపయోగించాలి. నాణ్యతలేని పెన్నులను ఉపయోగిస్తే రాసే క్రమంలో ఇంకు ఎక్కువగా వచ్చి అక్షరాల రూపం చెడుతుంది.

తేలికగా ఉండే నాణ్యమైన పెన్నులనే వాడాలి. బరువుగా ఉండే పెన్నును వాడడం వల్ల చేతివేళ్ల మధ్యలో నొప్పి వస్తుంది.

వేళ్ల మధ్య పెన్నును పట్టుకునే చోట గ్రిప్ ఉండే విధంగా చూసుకోవాలి.


రాస్తున్నప్పుడు చెమట వస్తే రాత స్వరూపం మారుతుంది. చెమట రాకుండా చేతులను తరచూ తుడుచుకోవాలి.

పరీక్ష రోజే కొత్త పెన్నును వాడకుండా కొన్ని రోజుల ముందు నుంచి వాడుతున్న పెన్నుతో పరీక్షలకు హాజరవ్వాలి.

చక్కగా రాస్తేనే మంచి మార్కులు పొందుతారు

చేరిపల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, కొండమల్లేపల్లిప్రతి విద్యార్థికి చదువు, విజ్ఞానంతో పాటు చేతిరాత అత్యంత ప్రాధాన్యం. రాత మంచిగా ఉంటేనే అధిక మార్కులు పొందుతారు. చేతిరాత బాగాలేదని ఆత్మన్యూనతతో ఉండకూడదు. ప్రతి ఒక్కరూ సాధనతో చేతిరాతను మార్చుకునే వీలుంటుంది. మా పాఠశాలలో నిత్యం తరగతి ఉపాధ్యాయులు చేతిరాతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సాధన చేయిస్తారు.

# యాదాద్రిలో మార్పులొచ్చేనా?



యాదగిరిగుట్ట : యాదాద్రి పంచ నారసింహుల పుణ్యక్షేత్రంలో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఏమైనా లోపాలున్నాయా? ఉంటే వాటి సవరణకు ఎలాంటి చర్యలు తీసుకోవా లనే అంశంపై పాలకులు దృష్టి పెట్టినట్లు సమాచారం. సంబంధిత అధికారులతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ త్వరలోనే ప్రత్యేక సమీక్ష సమావేశం చేపట్టే అవకాశం ఉంది. ఆ మేరకు క్షేత్రాభివృద్ధిలో ఇప్పటి వరకూ ప్రాధికార సంస్థ (వైటీడీఏ) చేపట్టిన పనులపై ప్రభుత్వం ఆరా తీస్తోంది.

వీటిని పరిశీలిస్తే..

మాస్టర్ ప్లాన్ లేకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేయకుండా అభివృద్ధి పనులు చేపట్టడంతో గుట్ట సంప్రదాయాలు కనుమరుగయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొండపైన గతంలోని కాటేజీలు, గదుల సముదాయాలను నేలమట్టం చేశారు. కనీస వసతుల్లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం కొండపైన కాటేజీలు, గదులు 400కు పైగా ఉండేవి. పుణ్యస్నానాలకు విష్ణు పుష్కరిణి, వ్రతాలకు ప్రత్యేక మండపం, పెళ్లిళ్లకు సదుపాయాలు ఉండేవి, ప్రస్తుతం అవేవి కనిపించడం లేదు. పంచ నారసింహులు కొలువై ఉన్న దివ్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే భక్తుల మొక్కుకు ప్రస్తుతం అవకాశం లేకుండా పోయింది. విష్ణు పుష్కరిణిని ఆలయోత్సవాలకే పరిమితి చేయడంతో పుణ్యస్నానాల పర్వం కొండ కింద నిర్మితమైన పుష్కరిణికి మారింది. ఇక ఆలయ సన్నిధిలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల నిర్వహణ సైతం కొండ కిందకు తరలించారు.పాతికేళ్ల క్రితం అప్పటి రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీచక్ర సముదాయం పేరిట వసతి గదులతో పాటు దర్శనం వరుసల సముదాయాన్ని నిర్మించాలని అప్పట్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రణాళిక ద్వారా ప్రస్తుత ప్రభుత్వ పాలకులు భక్తులకు వసతులు కల్పించనున్నట్లు తెలుస్తోంది.

రాత్రివేళ కొండపై బసచేసి నిద్ర మొక్కు తీర్చుకునే అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం భద్రత పేరిట కొండపైన భక్తులు ఉండకుండా గేట్లకు తాళాలు వేస్తున్నారు.

యాదగిరిగుట్టలో మాస్టర్ ప్లాన్ పునరుద్ధరణ జరగాల్సిన అవసరం ఉందని భక్తులు, స్థానికులు ఆశిస్తున్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందే సీఎం రేవంత్‌రెడ్డి ఈ క్షేత్రాన్ని సందర్శించి మార్పులకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

# అద్దె భవనాలు.. అరకొర వసతులు

కరీంనగర్ :బీర్పూర్ మండలంలోని మంగెళలో పక్కా భవనం లేకపోవడంతో గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించాల్సి వస్తోంది. మండలంలోని కందెనకుంటలో ఉన్న భవనంలోనే ఓ వైపు ప్రభుత్వ పాఠశాల, మరో గదిలో పంచాయతీ కార్యాలయం, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపించాల్సిన పరిస్థితి. జిల్లాలోనే అనేక కేంద్రాలు అద్దె భవనాలు, పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది.

మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు మౌలిక వసతులు కొరవడి సమస్యలతో సతమతమవుతున్నాయి. పక్కా భవనాలు లేకపోవడం, అద్దె భవనాల్లో అరకొర వసతులు, ఆట స్థలాలు లేక ఇరుకైన గదుల్లో కొనసాగుతున్న కేంద్రాలే ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి, మల్యాలలో సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాధికారిణి కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో కేవలం 272 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు కలిగి ఉండగా, మరో 256 కేంద్రాలు పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా కొనసాగుతున్నాయి. మిగతా 537 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న సొంత భవనాల్లోనూ 138 భవనాలకు వివిధ మరమ్మతు అవసరం ఉండగా, మరో 38 కేంద్రాలు అసంపూర్తి నిర్మాణాలతో ఉన్నాయి.

వసతులు లేక అవస్థలు

జిల్లాలోని 1065 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 14,642 మంది



గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు వారు 34,881 ఉండగా, అయిదేళ్లలోపు వారు 15,005 మంది ఉన్నారు. అనేక కేంద్రాలలో సరైన వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, ఆయాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అంతేకాకుండా అద్దె భవనాలలో కొనసాగుతున్న కేంద్రాలకు గతంలో రూ.500 నుంచి రూ.1000 వరకు చెల్లించగా ప్రస్తుతం రూ.2 వేల వరకు పెంచారు. మూడు నెలలుగా అద్దె చెల్లింపు బకాయిలు రాకపోవడంతో భారంగా మారింది.

అదనపు సేవలే అధికం..

గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయినులకు కేంద్రాల నిర్వహణతో అదనపు పనులు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ఓటర్ల జాబితా సవరణ, నమోదు వంటి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వస్తోంది. ప్రతి నెల సమావేశాలు, సర్వేలతో కాలం గడిచిపోతుందని కేంద్రాలపై దృష్టి సారించలేకపోతున్నామని ఉపాధ్యాయినులు వాపోతున్నారు.

# ఏఆర్‌టీ కేంద్రం లెక్కల్లో గందరగోళం

కరీంనగర్ : కరీంనగర్ సంక్షేమ విభాగం: జిల్లా ప్రధాన ఆసుపత్రి ప్రభుత్వ వైద్య కళాశాలగా మారడంతో నవంబరు 1 వరకు ఫర్నీచర్‌తోపాటు అన్నీ రకాల లెక్కలను వైద్య విధాన పరిషత్ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అప్పగించాలి. అందులో భాగంగా ఏఆర్‌టీ (యాంటీ రీట్రోవైరల్ థెరపీ) కేంద్రానికి సంబంధించిన లెక్కలను వైద్య విధాన పరిషత్ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అప్పగించారు. నిబంధనల ప్రకారం లెక్కలు అప్పగించాక తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అందులోంచి రూపాయి ఖర్చు చేయకూడదని ఆసుపత్రి అధికారుల వాదన. కానీ రూ.3,69,500 వరకు మొత్తాన్ని చెల్లింపులు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి దృష్టికి వచ్చింది. ఆయన ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రెండు శాఖల మధ్య సమన్వయ లోపం

వైద్య విధాన పరిషత్ అధికారులకు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యాధికారులకు మధ్య సమన్వయ లోపం ఉంది. కరీంనగర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు ఛాంబర్ కేటాయించలేదని, వైద్య సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయలేదని వైద్య కళాశాల బృందం ఆరోపణ.




ఇప్పటికీ ఈ రెండు విభాగాల మధ్య సమన్వయ లోపం ఏర్పడడంతో ఆసుపత్రిలోని అన్నీ రకాల పనులకు ఇబ్బందిగా మారుతోంది. పలువురు సిబ్బంది బదిలీ అయినప్పటికీ ఇక్కడే కొనసాగడం...లెక్కల విషయంలో గందరగోళం.. ప్రతీది జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్తుంది. ఇప్పటికైనా రెండు విభాగాల మధ్య ఒక ఉన్నతాధికారిని నియమించి అన్నీ రకాల లెక్కలు సరి చేయాల్సి ఉంది.

పాతవి చెల్లించాం

ఏఆర్‌టీ కేంద్రానికి సంబంధించిన లెక్కలను జనవరిలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందజేశాం. నవంబరులో పాత బిల్లులకు సంబంధించిన చెల్లింపులు చేశాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి లెక్కలు సమర్పించిన తర్వాత ఎలాంటి చెల్లింపులు చేయలేదు.

– కృష్ణ ప్రసాద్, అప్పటి సూపరింటెండెంట్

లెక్కలు అప్పగించాక చెల్లింపులు..కేంద్రానికి సంబంధించిన లెక్కలను మాకు నవంబరు 1న అప్పగించారు. 2వ తేదీ నవంబరు తర్వాత నాలుగు రకాలుగా చెల్లింపులు చేశారు. నిబంధనల ప్రకారం ఒక్కసారి లెక్కలు అప్పగించిన అనంతరం ఎలాంటి బిల్లులు చెల్లించకూడదు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– వీరారెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

# ఈ కోడ్ ఉంటే చాలు

హైదరాబాద్: వాహనాల మాదిరే విమానాలు ఏ ప్రాంతానికి చెందినవో గుర్తు పట్టేందుకు కోడ్‌లు ఉన్నాయి. భారతదేశానికి చెందిన విమానాలన్నింటికీ 'విటి' కోడ్‌తో మొదలవుతుంది. వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శనకు వెళ్తే అక్కడ ఏయే దేశాలకు చెందిన విమానాలున్నాయో ఇట్టే కనిపెట్టేయొచ్చు.

పైలెట్ ఆల్ఫాబెట్‌లు ఇలా.. 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)' కేంద్రాల్లో కమ్యూనికేషన్ విభాగంలో పైలెట్లు ఈ కోడ్‌తోనే సంభాషణ చేస్తుంటారు. తద్వారా రాకపోకలపై నమోదు చేస్తుంటారు. పైలెట్లు సంభాషించే ఆల్ఫాబెట్‌ల వివరాలు పరిశీలిస్తే... ఎ – ఆల్ఫా, బి – బ్రావో, సి – చార్లీ, డి – డెల్టా, ఇ– ఎకో, ఎఫ్ – ఫాక్స్‌ట్రాట్, జి – గోల్ఫ్, హెచ్ – హోటల్, ఐ– ఇండియా, జే – జూలియెట్, కె- కిలో, ఎల్ – లిమా, ఎం– మైక్, ఎన్ – నవంబర్, ఓ – ఆస్కార్, పి- పాపా, క్యూ – క్యూబెక్, ఆర్ – రోమియో, ఎస్ – సియెర్రా, టి – ట్యాంగో, యు – యునిఫార్మ్, వి – విక్టర్, డబ్ల్యూ – విస్కీ, ఎక్స్ – ఎక్స్‌రే, వై – యాంకీ, జెడ్ – జులు.



వింగ్స్ ఇండియాలో 25 దేశీ, విదేశీ విమానాలు ప్రదర్శిస్తున్నారు. అందులో 'విటి'తో ఉన్నవి భారత్‌కు చెందినవి. భారత విమానాల కోడ్‌లో 'విటి' అంటే (విక్టర్ ట్యాంగో) అని అర్థం. మిగిలిన దేశాలకు చెందిన విమానాలను గుర్తు పట్టాలంటే ఈ కోడ్‌ల ఆధారంగా గుర్తించాల్సిందే. ఎయిర్‌క్రాఫ్ట్ రిజిస్ట్రేషన్లలో ఆయా దేశాలకు కోడ్‌లను ముందే నిర్ణయించారు. కోడ్ తర్వాత అక్షరాల వరకు పెంచుకునేలా మార్గదర్శకాలున్నాయి. భారత్‌కు 'విటి' కేటాయించగా.. విటి ఏఏఏ నుంచి విటి జెడ్‌జెడ్‌జెడ్ వరకు నెంబర్లను కేటాయించొచ్చు. అమెరికాకు చెందిన విమానాలకు 'ఎన్' అనే అక్షరంతో కోడ్ మొదలవుతుంది. ప్రదర్శనలో ఉంచిన బాహుబలి బోయింగ్ విమానానికి 'ఎన్779ఎక్స్ డబ్ల్యూ' అని ఉంది. దీన్ని 'నవంబర్779ఎక్స్‌రేవిస్కీ' అని పలుకుతారు. అఫ్ఘనిస్తాన్‌కి – వైఏ, అర్జెంటీనా అయితే ఎల్‌వి, ఆస్ట్రేలియా – ఓఇ, బంగ్లాదేశ్ – ఇడబ్ల్యూ, చైనా – బి, ఫ్రాన్స్ – ఎఫ్, జర్మనీ – డి, ఇటలీ – ఐ, జపాన్ – జేఏ, మాల్దీవులు – 8క్యూ, నేపాల్– 9ఎన్, రష్యా – ఆర్ఏ, సౌదీ అరేబియా – హెచ్‌జెడ్, దక్షిణాఫ్రికా – జెడ్ఎస్, జెడ్‌టి, జెడ్‌యూ, శ్రీలంక – 4ఆర్, సిరియా – వైకే, థాయిలాండ్ – హెచ్ఎస్, యూ, ఉక్రెయిన్ – యుఆర్‌యుకే – జి, పాకిస్థాన్ – ఎపి.

# పచ్చ బంగారం.. అందని ప్రోత్సాహం

పరిగి : వాణిజ్య, సుగంధ పంటగా పేరొందిన పసుపు సాగులో జిల్లా రైతులకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభించడంలేదు. కనీసం గిట్టుబాటు ధరకూడా దక్కక సాగుపై ఆసక్తి చూపలేకపోతున్నారు. దీంతో కాలం గడిచేకొద్దీ విస్తీర్ణం పడిపోతోంది.

ఆరేళ్ల క్రితం 5,000 ఎకరాలు

స్వల్ప కాలిక రకాలు అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లా రైతులు దీర్ఘకాలిక రకాన్నే సాగుచేస్తారు. ఇది చేతికి రావాలంటే ఏడాది పడుతుంది. 'లక్ష్మి పంట'గా పిలిచే పసుపును నీరున్న ప్రతి రైతు కొద్దిపాటి పొలంలోనైనా సాగు చేయడానికి ఆసక్తి చూపుతారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు డివిజన్లలో కలిపి ఆరేళ్ల క్రితం సుమారు 5,000 ఎకరాలకుపైగా సాగయ్యేది. ఏడాది పొడవునా 7 నుంచి 9 వరకు నీటి తడులు అందించి శ్రమించినా...గిట్టుబాటు ధర లభించక పెట్టు బడులు సైతం చేతికి రావడంలేదని రైతులు సాగుపై విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం 2000 ఎకరాల్లో కూడా సాగు కావడంలేదు.

రూ.14 వేలు మద్దతు ధర ప్రకటించాలి

ఎకరాకు రూ.60 వేలకు పైగా పెట్టుబడులు అవుతున్నాయని, దిగుబడి 8నుంచి 10 క్వింటాళ్ల వరకు రాగా స్థానిక మార్కెట్‌లో రూ.9 వేల లోపు మాత్రమే ధర పలకడంతో కూలి కూడా గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.14 వేల మద్దతు ధరను ప్రకటిస్తే పసుపు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వం పసుపు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి పసుపు రైతులను ప్రోత్సహించాలన్నారు.

పరిగి పెట్టింది పేరు



పసుపు సాగుకు పరిగి డివిజన్ పెట్టింది పేరు. జాఫర్‌పల్లి, రాఘవాపూర్, లక్ష్మీదేవిపల్లి, నారాయణ్‌పూర్, నస్కల్, బర్కత్‌పల్లి గ్రామాల్లో పండించిన పసుపు కొమ్ములకు డిమాండ్ అధికంగా ఉండేది. ఇక్కడినుంచి ఇతర రాష్ట్రాలకు సైతం పెద్దమొత్తంలో ఎగుమతి జరగడంతో ధరలు పసిడితో సరితూగేవి. క్వింటాలు ధర రూ.14 వేలకు పైనే పలికేది. ప్రభుత్వం ప్రోత్సాహం లేకపోవడం, ఎగుమతి లేక డిమాండు తగ్గడంతో రైతన్నలు తీవ్ర నష్టాల పాలవుతున్నారు.

పెట్టుబడులు కూడా రావడం లేదు..– దేవేటందర్‌రెడ్డి, రైతు, సంజీవ నగర్, దోమ

దాదాపు 15 ఏళ్లుగా పసుపు పంటను సాగు చేస్తున్నా. పదేళ్ల క్రితం క్వింటాలుకు రూ.14 వేల నుంచి రూ.17 వేల వరకు అమ్ముడై బంగారానికి సరి తూగేది. గతేడాది మార్కెట్లో క్వింటాలుకు రూ.8500ల ధర పలకడంతో తీవ్రంగా నష్టపోయా. ప్రభుత్వం పసుపు రైతులకు అండగా నిలవాలి.

# ఆగని జలం



సిరిసిల్ల: ఒక్కో చెక్‌డ్యామ్‌లో సుమారు మూడు మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యంతో నీటిని నిల్వ చేయాల్సి ఉంటుంది. పలు చెక్‌డ్యామ్‌ల్లో నీరు నిల్వ ఉన్నప్పటికీ ఆత్మకూర్ చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెక్‌డ్యామ్ నిర్మాణానికి సుమారు రూ.277.7 లక్షలు మంజూరయ్యాయి. చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ లేక రైతులు వాగులో ఇసుకను తవ్వి మోటార్ల ద్వారా పంటలకు నీరందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చెక్‌డ్యామ్‌కు సమానంగా ఇసుక వచ్చి చేరుతుండడంతో నీరు నిల్వ ఉంటుందో? లేదోనని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎగువ నుంచి వచ్చే వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు గత ప్రభుత్వం వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. వీటి నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. భూగర్భజలాల పెంపుకోసం నిర్మించిన చెక్‌డ్యామ్(అడ్డుకట్ట)లో కొన్ని చోట్ల నీరు నిలవక నిధులు వృథా అవుతున్నాయి. మొదటి వర్షానికే పనుల్లో డొల్లతనం బయట పడింది. అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.జల వనరుల శాఖ మెట్‌పల్లి డివిజన్ పరిధిలో మూడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.18.36 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మెట్‌పల్లి మండలంలో పెద్దవాగుపై ఆత్మకూర్, కొండ్రికర్ల, చౌలమద్ది, పెద్దాపూర్, ఆరపేట, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామాల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూగర్భజలాలు పెంపొందించడంతో పాటు సుమారు 358 ఎకరాల ఆయకట్టుకు లాభం చేకూర్చాలనే లక్ష్యంతో 2021లో పనులను ప్రారంభించారు. అప్పట్నుంచి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కొండ్రికర్ల, పెద్దాపూర్, ఆరపేట, చిట్టాపూర్ చెక్‌డ్యామ్‌లకు సంబంధించి చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఆత్మకూర్, చౌలమద్ది చెక్‌డ్యామ్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. ఆత్మకూర్ చెక్‌డ్యామ్ నిర్మాణ సమయంలో వర్షాలు కురిసి వాగులో నీటి ప్రవాహం రావడంతో బాడీ వాల్ ఒకవైపు కొట్టుకుపోయింది. మొదట తక్కువ ఎత్తులో బాడీవాల్ నిర్మాణం చేయడం, ఆ సమయంలో నీటి ప్రవాహం రావడంతో ఒకవైపు కొట్టుకుపోయింది. మొదటి వర్షానికే చెక్‌డ్యాం దెబ్బతినడంతో నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రవాహానికి కొట్టుకుపోయిన బాడీవాల్ నిర్మించడంలో జాప్యంతో నీరంతా వెళ్లిపోయింది.

నీరు నిల్వలేక అవస్థలు

– గంగాధర్, రైతు, ఆత్మకూర్

ఆత్మకూర్‌లో చెక్‌డ్యామ్ నిర్మించినప్పటికీ నీరు నిల్వ లేక ఇసుకను కొంత తవ్వి మోటార్లు అమర్చుకొని పంటలకు నీరు పారిస్తున్నాము. నీరు నిల్వ ఉంటే వేసవిలో భూగర్భజలాలు పెరిగి సాగునీరందుతుందని అనుకున్నాము. ప్రస్తుతం నీరు లేక మరో పంట వేసే పరిస్థితి లేదు. అధికారులు చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉండేలా చూడాలి.

పనులు పూర్తయ్యాయి– దేవానంద్, డీఈ, జలవనరుల శాఖ

ఏడు చెక్‌డ్యామ్‌ల్లో అయిదు పూర్తయ్యాయి. ఆత్మకూర్, చౌలమద్దిలో కొంత మిగిలి ఉండడంతో పనులు చేపడుతున్నాము. ఆత్మకూర్ చెక్‌డ్యామ్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహం రావడంతో బాడీ వాల్ కొద్దిగా కొట్టుకుపోయింది. పనులు పూర్తి నాణ్యతతో జరిగాయి. పెద్దవాగుపై మొదటి చెక్‌డ్యామ్ కావడంతో ఆత్మకూర్ వద్ద కొంత ఇసుక వచ్చి ఆగుతుంది. దీనివల్ల ఇబ్బందేమీ ఉండదు. నీరు నిల్వ ఉంటుంది.

# చివరి దశలో నిలిచిన పనులు



సిరిసిల్ల: జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. దీనిలోని రెండు దశల్లో మొదటిది రాజరాజేశ్వర నుంచి మల్కపేట, సింగసముద్రం జలాశయం వరకు ప్రధాన పనులు దాదాపు పూర్తయ్యాయి. గతేడాది మే, జూన్ నెలల్లో ఇక్కడి పంపుహౌస్‌లో ట్రయల్‌రన్ కూడా విజయవంతమైంది. ఎడమ ప్రధాన కాల్వ ద్వారా గంభీరావుపేట మండలం సింగసముద్రానికి నీటిని తరలించేందుకు అనువుగా ఉంది. అక్కడి నుంచి రెండో దశ ఎగువమానేరుకు నీటిని తరలించేందుకు గంభీరావుపేట మండలం నాగంపేటలో పంపుహౌస్ పనులు జరగాల్సి ఉంది. సివిల్ పనులు చేసే గుత్తేదారు మూడు నెలలుగా క్యాంపునకు తాళం వేసి వెళ్లారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. సివిల్ పనులు పూర్తయితేనే మోటార్లు బిగించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ పనులకు సంబంధించిన గుత్తేదారులు మోటార్లతో సిద్ధంగా ఉన్నారు. మోటార్ల బిగింపు, ట్రయల్‌రన్‌కు మూడు నెలల సమయం పడుతుంది. ఇవన్నీ పూర్తయితే గానీ ఎగువమానేరుకు నీరు వెళ్లలేని పరిస్థితి. ఈ ప్యాకేజీ పనులు ప్రారంభమై దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు.

భూసేకరణకు రూ.52 కోట్లు అవసరం

జలాశయాల పునరాకృతిలో 9వ ప్యాకేజీకి రూ. 1,464.42 కోట్లు కేటాయించారు. దీనిలో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. భూసేకరణలో జాప్యంతో పనుల గడువును ఇప్పటికి నాలుగుసార్లు పొడిగించారు. చివరగా ఈ ఏడాది జూన్ నెలాఖరులోగా మొత్తం పనులు పూర్తి చేయాల్సి ఉంది. సివిల్ పనులకు గాను బిల్లుల చెల్లింపులు దాదాపు పూర్తయ్యాయి. మల్కపేట జలాశయం కుడి, ఎడమ ప్రధాన కాల్వలు, వాటికి డిస్ట్రిబ్యూటరీలు, నాగంపేట పంపుహౌస్ నుంచి ముస్తాఫనగర్‌లోని బట్టలచెరువు అక్కడి నుంచి ఎగువమానేరు వరకు అయిదు డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటిలోనూ 1, 3 డిస్ట్రిబ్యూటరీల్లో కొంత భూసేకరణ జరిగింది. ఈ మేరకు పనులు కూడా జరిగాయి. ఈ ప్యాకేజీ మొత్తానికి సుమారు 400 ఎకరాలు సేకరించాలి. ఇందుకు సుమారు రూ.52 కోట్లు అవసరం. తక్షణం కాల్వల ముందుకు సాగాలంటే రూ.25 కోట్లు అయినా అవసరం.

సమీక్షించాలి

రాజరాజేశ్వర జలాశయం నుంచి ఏడాదిలో 120 రోజుల్లో 11.63 టీఎంసీల నీటిని ఎగువమానేరుకు తరలిస్తారు. వీటితో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల్లో 86,150 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇప్పటి వరకు ప్యాకేజీలో ప్రధాన పనులు జరిగాయి. చివరి దశలో భూసేకరణకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులపై లోతుగా పరిశీలించాలి. మండలాల వారీగా సాగులోకి వచ్చే ఆయకట్టు అంచనా వేసి అందుకు అనుగుణంగా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ప్యాకేజీ కింద చెరువులు సైతం మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్యాకేజీ పనులు పూర్తి చేయడానికి భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఇలా ఒక్కో అంశాన్ని లోతుగా అధ్యయనం చేసి ప్యాకేజీ పనుల్నీ పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికైనా పూర్తి చేస్తే వేలాది రైతుల సాగు కష్టాలు తీరుతాయి.

గుత్తేదారుకు నోటీసులు ఇస్తున్నాం– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ 9వ ప్యాకేజీ

ప్యాకేజీలో ప్రధానంగా 80 శాతం పనులు పూర్తయ్యాయి. సివిల్ పనులు చేసినంత మేరకు గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. నాగంపేట పంపుహౌస్‌లో కొద్ది మేరకు పనులు చేపడితే పంపులు బిగించే పనులు జరుగుతాయి. మూడు నెలలుగా ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నోటీసులు ఇస్తున్నాం. అయినా స్పందన లేదు.

# నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం

కరీంనగర్ : శాంతిభద్రతల పర్యవేక్షణలో నిఘా నేత్రాలు కీలక పాత్ర వహిస్తాయి. ఒక్క నిఘానేత్రం వంద మంది పోలీసులతో సమానమని తరచూ వింటుంటాం. అంతటి కీలకమైన పాత్ర పోషించే నిఘా నేత్రాల నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. మంగళవారం రాత్రి దాటిన తర్వాత జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మనగర్ గ్రామాల్లో ఆరు ఆలయాల్లో చోరీ జరిగి హుండీ, ఆభరణాలు అపహరించుకపోయిన సంగతి తెలిసిందే. గతంలో పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. వెల్లుల్ల, జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మకూర్ గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి అమర్చిన నిఘా నేత్రాల్లో కొన్ని పని చేయడం లేదని తెలుస్తోంది. వెల్లుల్లలో 32 నిఘా నేత్రాలకు సుమారు 11, జగ్గాసాగర్‌లో 10కి ఒకటి మాత్రమే పని చేస్తున్నాయి. రామలచ్చక్కపేటలో సాంకేతిక సమస్యతో రికార్డింగ్ కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఆత్మకూర్‌లో అయిదు వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేక, నిర్వహణ లోపంతో నిఘా నేత్రాలు పని చేయని దుస్థితిలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కేబుల్ సమస్య,



వాహనాల రాకపోకలతో దెబ్బతినడం, కొందరు కావాలని కేబుళ్లను తొలగించడం, కోతుల బెడదతో పాటు నిర్వహణ వ్యయం లేక సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. నిఘా నేత్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# చేయూత అందిస్తే.. ఎస్ఆర్‌డీపీ-2 సాకారం!

హైదరాబాద్: రాజధానిలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం) మొదలైంది. మొదటి దశ కింద ఇప్పటికే రూ.5 వేల కోట్లు వెచ్చించి 35 పనులు పూర్తి చేసింది. కొనసాగింపుగా ఎస్ఆర్‌డీపీ–2ను పూర్తి చేయాల్సి ఉండగా.. ఆర్థిక తోడ్పాటు అందించాలని బల్దియా ఇంజినీరింగ్ విభాగం తాజాగా సర్కారుకు లేఖ రాసింది. గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లే.. ఇప్పుడూ విన్నవించామని యంత్రాంగం స్పష్టం చేస్తోంది. రెండోదశ పనులతో హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య మరింత తగ్గుతుందని, వాహనాల సగటు వేగం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

కారిడార్లు, రైల్వే వంతెనలు..

రెండో దశ ఎస్ఆర్‌డీపీలో మొత్తం 27 పనులుంటాయని అధికారులు తెలిపారు. అందులో రూ.3,515 కోట్ల విలువైన ప్రతిపాదనలు జీహెచ్ఎంసీకి చెందినవి. మిగిలిన పనులు హెచ్ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో చేపట్టదలచినవి. రెండింటికీ నిధులను కేటాయించాలని జీహెచ్ఎంసీ సర్కారును కోరింది. రూ.150 కోట్లతో బెంగళూరు ప్రధాన రహదారి నుంచి శాస్త్రిపురం కూడలి వరకు రహదారి అభివృద్ధి, రూ.250 కోట్లతో శాస్త్రిపురం కూడలినుంచి ఇంజిన్ బౌలి వరకు రహదారి అభివృద్ధి, రూ.450 కోట్లతో ఉప్పల్ కూడలి పైవంతెనలు, రూ.100 కోట్లతో జూబ్లీ చెక్‌పోస్టు వద్ద రెండు పైవంతెనలు, రూ.175 కోట్లతో



రేతిబౌలి, నానల్‌నగర్ కూడళ్ల వద్ద పైవంతెనలు, ఓ అండర్‌పాస్, రూ.45 కోట్లతో ఫాక్స్‌సాగర్ సర్‌ప్లస్ నాలాపై వంతెన, రూ.1080 కోట్లతో ఖాజాగూడ వద్ద సొరంగమార్గం, రూ.135 కోట్లతో కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద పైవంతెనలు, రూ.70 కోట్లతో బండ్లగూడ కూడలి వద్ద వంతెన, రూ.70 కోట్లతో ఒమర్ హోటల్ కూడలివద్ద వంతెన, రూ.150 కోట్లతో ఫలక్‌నుమా– బుద్వేల్ ఆర్ఓబీ, రూ.20 కోట్లతో మాణికేశ్వర్‌నగర్‌లో ఆర్‌యూబీ, రూ.30 కోట్లతో చిలకలగూడ ఆర్‌యూబీ, రూ.90 కోట్లతో ఆరాంఘర్‌లో రెండు ఆర్‌యూబీలను నిర్మించాలని జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధం చేయగా.. శివారులోని పలు రహదారుల అభివృద్ధికి హెచ్ఆర్‌డీసీలను నిధులను కోరింది.

సర్కారు నిధులిస్తేనే..మొదటి దశ కింద చేపట్టిన ఎస్ఆర్‌డీపీకి జీహెచ్ఎంసీ భారీగా అప్పులు చేసింది. ఇంకా పలు ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తి చేయాలంటే రూ.1600 కోట్లు అవసరం. అందుకోసం బల్దియా బ్యాంకు రుణాలను తీసుకుంటోంది. రెండో దశకు అప్పు దొరికే పరిస్థితి లేకపోవడంతో.. జీహెచ్ఎంసీ ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడింది. గత సర్కారుకు కూడా నిధులు కేటాయించాలని పలుమార్లు ఇంజినీర్లు లేఖ రాయగా, స్పందన లభించలేదు. కొత్త సర్కారైనా చేయూతనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి జాడేది.. అక్రమాలకు అడ్డేది?

హైదరాబాద్: రాజధాని పరిధిలోని ప్రధాన విభాగాల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలిలో పరిస్థితి అధ్వానంగా మారింది. కొందరు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని, మధ్యాహ్నం తరువాత కార్యాలయాలకు వచ్చి కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం పడకేసినా.. మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నా.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బల్దియా.. పర్యవేక్షణ మరిచారా?

బల్దియా పరిధిలో జోనల్, డిప్యూటీ కమిషనర్లు నిత్యం పరిధిలో పర్యటించాలి.. కానీ అదెక్కడా జరగడం లేదు. జోనల్ కమిషనర్లు పెద్దగా పట్టించుకోకపోవడంతో చాలామంది డిప్యూటీ కమిషనర్లు మధ్యాహ్నం తరువాత తమ కార్యాలయానికి వస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలో నిత్యం రెండు మూడు వేలమంది సక్రమంగా విధులకు రావడం లేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు కాలనీల్లో రోడ్లు, ఇతర నిర్మాణాలకు దాదాపు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో నాలుగైదుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రావడం లేదు. వీటిపై అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

హెచ్ఎండీఏలో...: హెచ్ఎండీఏ.. కొంతకాలంగా అక్రమ నిర్మాణాలపై దృష్టిసారించడం మానేసింది. దీంతో అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిగిపోతున్నాయి. కొందరు అధికారులు రూ.లక్షల్లోనే వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు చోట్ల భూసేకరణ ద్వారా భారీ వెంచర్లు వేయాలని తలపెట్టింది. ఈ పథకం కూడా ముందుకు సాగడం లేదు. ఏళ్లుగా బదిలీలు లేకపోవడం.. అనేకమంది అధికారులపై ఆరోపణలు.. నిలిచిన అభివృద్ధి పనులతో హెచ్ఎండీఏ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

జలమండలిలో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఫిర్యాదులు పెరుగుతున్నాయి. దాదాపు 150 వరకు ఎయిర్‌టెక్ యంత్రాలున్నా.. ప్రధాన రహదారులపై కూడా మురుగు సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఉచిత తాగునీటి పథకంలో భాగంగా కొందరు వాణిజ్య సంస్థల ప్రతినిధులు కనెక్షన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనిపై విజిలెన్స్ తనిఖీలు లేవు.

పడకేసిన పన్ను వసూళ్లు..పన్ను వసూళ్లపై జోనల్ కమిషనర్లు, ఉప కమిషనర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, ఇప్పటివరకు వసూలైన పన్ను 50శాతమే ఉండటం అందుకు నిదర్శనం. దీని ప్రభావం జీహెచ్ఎంసీ పాలనా వ్యవహారాలపై పడుతోంది. ఫిబ్రవరి ముగిసేనాటికి ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకోవాలని ఇటీవల సమీక్షలో కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశించారు. కొందరు జోనల్ కమిషనర్లను.. బడా పన్ను బకాయిదారుల పేర్లు చెప్పాలని అడగ్గా, ఏ ఒక్కరూ చెప్పలేకపోయారు. ఆస్తిపన్ను విభాగాన్ని గాలికొదిలేశారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తరువాత కూడా పరిస్థితిలో పురోగతి కనిపించకపోవడం కేంద్ర కార్యాలయాన్ని భయపెడుతోంది.

# విలీన కాలనీల్లో నీటి ఎద్దడి

కరీంనగర్ : మండుతున్న ఎండలతో విలీన కాలనీల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఇళ్లల్లో ఉన్న బోరు బావులు, వీధుల్లో ఉన్న చేతి పంపులు ఎండిపోవడంతో ఆయా కాలనీల్లోని ప్రజలు నీటికి అవస్థ పడుతున్నారు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు అక్కడి నివాసితులు ఆందోళనకు గురవుతున్నారు. నగరానికి ఆనుకొని ఉన్న కాలనీలకు శుద్ధజలం సరఫరా కాకపోవడం, పక్కనే ఉన్న వీధుల్లో నీరంతా వృథాగా పోతుండటంతో ఆ ప్రాంతవాసులను కలచి వేస్తోంది. నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తారని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. శాశ్వత పరిష్కారం మాత్రం కావడంలేదు.

నాటి తప్పిదంతోనే సమస్య

విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ కింద తాగునీటి పైపులైను వేశారు. గ్రామపంచాయతీ సమయంలో సరైన స్థాయిలో పైపులైన్లు వేయకపోవడంతో ప్రధాన సమస్యగా మారింది. రెండు ఇంచుల మేర పైపులు వేయడంతో అందుల్లోకి నీరే రావడం లేదు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండగా అవి నిరుయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం అవి ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉండి ఎందుకు పనికి రాకుండా మారాయి. రూ.లక్షలు ఖర్చు చేసినా నిరుపయోగంగా మారింది. సరస్వతీనగర్, విద్యారణ్యపురి, సూర్యనగర్, రేకుర్తి శివారు, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది.

కొత్తగా లైను వేసినా..

విలీన కాలనీల్లో తాగునీరు వేసేందుకు రూ.5.50 కోట్లతో ప్రధాన పైపులైను వేశారు. పలు కాలనీలకు ఇంటర్ కనెక్షన్లు ఇచ్చి సరఫరా చేస్తుండగా కొంతమేర ఫలితం వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో నీరు రావడం లేదంటున్నారు. తీగలగుట్టపల్లిలోని సరస్వతీనగర్‌లో రైల్వే ట్రాక్ వరకు 12 ఇంచుల పైపులైను వేశారు. దానికి ఇంటర్ కనెక్షన్ కూడా ఇవ్వగా, కోర్టు రిజర్వాయర్ నుంచి నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. చివరి ప్రాంతం కావడంతో పైపుల్లోకే శుద్ధి నీరు చేరడం లేదు. ప్రధాన రోడ్డు నుంచి సరస్వతీనగర్ వరకు సాధారణ నిధుల కింద రూ.45 లక్షలతో పైపులైను వేసేందుకు అంచనాలు తయారు చేశారు. టెండర్ పిలవాల్సి ఉంది.

సొంతంగా.. ట్యాంకర్లతో సరఫరా..

సరస్వతీనగర్ ప్రాంతంలో సుమారు 600 ఇళ్లకు తాగునీటితోపాటు ఇతర అవసరాలకు ఇబ్బందులు తప్పడం లేదు. బహుళ అంతస్తులు, అద్దెకు ఇచ్చిన కుటుంబాల ఇంటి యజమానులు సొంతంగా ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. మిగతా వారంతా బల్దియా నుంచి వచ్చే ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. రోజులో ఒకటెండ్రు ట్యాంకర్లు వస్తుండగా ఇంటి యజమానులు డ్రమ్ములు, సంపులు నింపుకోవడంతో మిగతా ప్రాంతాలకు సరిపోవడం లేదు. వారంలో నాలుగు రోజులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో సొంత ఖర్చులతో ప్రైవేటు ట్యాంకర్ సమకూర్చి ఇంటింటా పోయిస్తున్నారు. రోజుకు పది ట్యాంకర్లు బావి నుంచి తెప్పిస్తున్నారు.

ఎన్నాళ్లీ కరవు–సరోజన, స్థానికురాలు

గత నెల రోజులుగా బోరు మొత్తం ఎండిపోయింది. నల్లా ఉన్నా నీరు రాదు. చుట్టూ ఉన్న ప్రాంతంలో ఎక్కడా ఉండదు. కార్పొరేటర్ ట్యాంకర్ పంపిస్తే డ్రమ్ములు, సంపులు నింపుతాం. అదీ రాకపోతే ఆ రోజు నానావస్థలు పడాల్సిందే. నల్లా వస్తుందని అదిగో, ఇదిగో అంటున్నారు. ఎన్నాళ్లీ ఈ కరవు.

పరిష్కరించని అధికారులు– తిరుమల, కాలనీవాసి

ఎండాకాలం వస్తే చాలు కాలనీల్లో బోర్లు ఎండిపోతున్నాయి. నల్లా ఇస్తే ఆ నీటితో ఇబ్బందులు తీర్చుకునే వారం. పైపులు వేసి వృథాగా వదిలేశారు. అందుల్లోంచి చుక్కా నీరు రాదు. మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్ సక్రమంగా రావడం లేదు. సమస్యపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

# నాకూ రూ.లక్ష కావాలి

సిరిసిల్ల : కులవృత్తులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న బీసీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనున్నట్లు ప్రకటించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి రాయితీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో మొత్తం 11,273 మంది బీసీలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొలి విడత పథకాన్ని ప్రకటించింది. ఈ నెల 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయనున్నారు. నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, కుమ్మరి, మేదరి, రజక, పూసలు తదితర కులాల వారికి ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నారు. నిరుపేద, దివ్యాంగులు, వితంతువులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 7 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చారు. అయితే సమయం సరిపోలేదని, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగేందుకే సమయం సరిపోయిందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం 2021 ఏప్రిల్ 1 వరకు ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని తెలిపింది. దీంతో అప్పటికే ధ్రువీకరణ పత్రాలున్న వారికి ఊరట కలిగినా, కొత్తగా ఆదాయ, కులం ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునేవారికి చాలా ఆలస్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో అధిక సంఖ్యలో ఉండే పద్మశాలీలను అర్హుల జాబితాలో చేర్చలేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పలువురు పద్మశాలీలు ఈ పథకానికి అనర్హులని చెప్పారని ఆరోపించారు. కానీ చాలా మంది పద్మశాలీలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడం గమనార్హం. పైరవీలకు అవకాశంకుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేరుగా అధికారులను కలిస్తే తప్పా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదన్న ఆరోపణలు వ్యక్తమ య్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులెవరూ పట్టించుకోలేదని, నిర్లక్ష్య ధోరణి అవలంబించారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పైరవీలతోనే పనులు జరిగాయని, నేతల సిఫారసుకు పెద్దపీట వేశారని ఆరోపిస్తున్నారు. పలువురు అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమవడంతో ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధ్రువపత్రాల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అయినా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతు న్నారు.ఎంతో ఉపయోగం– రాఘవేందర్, బీసీ సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారిప్రభుత్వం కులవృత్తిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 11,273 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 26లోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కానుంది. ఈ పథకం బీసీలకు ఎంతో ఉపయోగం. ఒకేసారి ఎక్కువ దరఖాస్తులు రావడంతో సర్వర్లు మొరాయించాయి. అధికారులు ధ్రువీకరణ పత్రాలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనడం అవాస్తవం.

# ఉన్నత పాఠశాలలకూ గ్రంథాలయ శోభ!



జనగామ : పాఠశాల విద్య బలోపేతానికి ప్రాథమిక పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందించిన ప్రభుత్వం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకూ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులతో పఠనాసక్తి పెంచడానికి, తాను చదివిన పుస్తకం గురించి పది మందికి వివరించేందుకు వేదిక సమకూర్చింది. ఉన్నత పాఠశాలలకు 120 టైటిళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 74 టైటిళు అందజేసింది. జిల్లా కేంద్రాలకు చేరిన పుస్తకాలను త్వరలో ఎంపిక చేసిన బడులకు పంపుతారు.

ఏ పుస్తకాలంటే..నేషనల్ బుక్‌ట్రస్టు రూపొందించిన పుస్తకాలు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో ఉన్నాయి. సాహిత్యం, కథ, నాటికలు, దేశభక్తుల వీర గాథలు, దేశభక్తి, దైవభక్తికి సంబంధించిన రచనలు ఉన్నాయి. వీటిని నిత్యం చదివితే విజ్ఞానం లభించడంతో పాటు సామాజిక స్పృహ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు 64 పుస్తకాలు, తొమ్మిది, పది తరగతుల వారికి 56 పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 74 రకాల పుస్తకాలు ఉంటాయి. వీటిని ఆకర్షణీయమైన రంగులలో రూపొందించారు.

ఎందుకు విస్తరించారంటే..

ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు విద్యా పరమైన ఒత్తిడి అధికంగా ఉంటుంది. చదువు, పరీక్ష ఫలితాలు, స్థాయి నిర్ధారణ తదితర అంశాలలో విద్యార్థికి మానసిక విశ్రాంతి లేకుండా పోతుంది. కొంత ఊరట కల్గించాలంటే పుస్తక పఠనం ఎంతో ఉత్తమమని నిపుణులు చేసిన సూచన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి రోజూ గ్రంథాలయ సందర్శన, పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయిస్తూ కాలనిర్ణయ పట్టిక తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించింది. వారానికో విద్యార్థి తాను చదివిన పుస్తకం గురించి మిగతా వారికి చెప్పాలి. భయం పోయి.. ధారాళంగా మాట్లాడే నైపుణ్యం కూడా అలవడుతుందని అధికారులు అనుకుంటున్నారు. జయశంకర్, ములుగు, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 495 పాఠశాలలను గుర్తించి గ్రంథాయల పుస్తకాలు సమకూరుస్తున్నారు.

మానసిక ఒత్తిడి తగ్గుతుంది

బొమ్మనబోయిన శ్రీనివాస్ అకడమిక్ మానిటరింగ్ అధికారి, జనగామ జిల్లా

ఉన్నత తరగతుల విద్యార్థికి పాఠ్యపుస్తకాల అధ్యయనంతో ఎంతో ఒత్తిడి ఉంటుంది. టీవీలు సెల్‌ఫోన్‌ల వల్ల అనర్థాలే తప్ప అదనపు ప్రయోజనం ఉండదు. పూర్వకాలంలో పుస్తక పఠనం నిత్యకృత్యం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కొత్త పుస్తకాలు చదవడం, సమీక్షించడంతో భయం పోయి నలుగురిలో మరింత అనర్గళంగా మాట్లాడగలుగుతాలు. మానసిక ఒత్తిడీ తగ్గుతుంది.

# పైపైకి ధరలు.. గుండెల్లో గుబులు!




జనగామ : డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, దిగుమతి లేకపోవడానికి తోడు అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. వారం రోజుల వ్యవధితోనే ధరలు ఎగబాకడంతో ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. వారం రోజుల కిందట రూ.150కు వచ్చిన సరకులు ఇప్పుడు రూ.250 పట్టుకెళ్లినా రావడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని మార్కెట్లలో ఆకాశాన్నంటిన ధరలు చూసి ప్రజలు బేజారెత్తిపోతున్నారు. కొండెక్కిన కొత్తిమీరా కూరగాయలు కొన్నాక కొసరన్నట్లు కొత్తిమీరా అడగటం పరిపాటి. అలాంటిది ఇప్పుడు రూ.5కి కూడా ఇవ్వలేమని వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. రూ.10కి నాలుగైదు కాడల కొత్తిమీరా చేతిలో పెడుతున్నారు. అదేమిటని అడిగితే.. మొన్నటిదాక కిలో రూ.40 పలికిన కొత్తిమీరా ఇప్పుడు కిలో రూ.130 అయిందంటున్నారు. కర్ణాటక నుంచి సరఫరా అవుతుండగా జిల్లాకు చేరుకునే సరికి వేడికి వాడిపోతుంది. రవాణాతో పాటు నష్టం కూడా ప్రజలపైనే వేస్తుండడంతో సామాన్యుడికి 'ధరా'ఘాతమైంది.

దిగుమతి చేసుకోవాల్సిందే

కాకరకాయలు ఒంటిమామిడి, టమాట మదనపల్లి, నిజమాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. క్యాప్సికం, బీన్స్ బెంగళూరు నుంచి వస్తుంది. బోయినపల్లి నుంచి కాలీఫ్లవర్, క్యాబేజీ, బీట్‌రూట్, కీరా దిగుమతవుతోంది. క్యారెట్ హైదరాబాద్ నుంచి, చామగడ్డ సికింద్రాబాద్ నుంచి తీసుకొస్తున్నారు.

కారణం ఇదే

జిల్లాలో కూరగాయల సాగు నామమాత్రంగా ఉంటోంది. రైతులు వేసవిలో బెండకాయ, వంకాయ మాత్రమే పండించారు. భానుడు నిప్పులు చెరగడంతో వీటి దిగుబడి పెద్దగా రాలేదు. ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన వర్షాలతో కొంత నష్టం వాటిల్లింది. దీంతో ఇవి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. టమాట, కాకరకాయ, బీరకాయ, చిక్కుడు, దోసకాయ, కాకరకాయ, దొండకాయ, ఆలుగడ్డలు, క్యాబేజీ, క్యారెట్‌ల దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకుని రావడానికి రవాణా వ్యయం అధికంగా అవుతుంది. సరఫరాలో జాప్యం జరిగితే ఇవి వాడిపోతుండటంతో ఆ నష్టంతోపాటు దళారుల బెడద కూడా వినియోగదారుడిపైనే పడుతోంది. బీన్స్ కిలో ధర రూ.250 ఉండటంతో స్థానిక వ్యాపారులు తెప్పించడం లేదు. స్థానికంగా కూరగాయల లభ్యత పెరిగితే తప్ప ధరలకు కళ్లెం వేయలేమని వ్యాపారులంటున్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి

పచ్చిమిర్చి పరిస్థితి ఇంతే. మొన్నటిదాక కిలో రూ.50 పలికిన పచ్చిమిర్చి ఇప్పుడు రూ.140. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు చేరే సరికి రవాణా ఛార్జీలు కలిపి ధర మూడింతలు పెరిగింది.

వేసవిలో సాగు తక్కువే

అనితశ్రీ, డివిజన్ ఉద్యానాధికారి, డోర్నకల్

కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. దీని ప్రభావం ధరలపై కనిపిస్తుంది. జిల్లాలో వేసవిలో కూరగాయల సాగు తక్కువే. రాయితీపై మల్చింగ్ మంజూరు చేస్తున్నాం. సాంకేతిక సూచనలు అందజేస్తున్నాం. బీర, కాకర, చిక్కుడు వంటి పందిరి తోటల సాగుకు ఈజీఎస్ నుంచి సామగ్రి, కూలీలకు పైకం అందిస్తున్నారు. జిల్లాలో నాలుగు పాలీహౌజ్‌లుండగా రెండింటిలో పూల తోటలు, మిగిలిన వాటిలో కీర వేశారు. ఇక 10 షేడ్‌నెట్లలో కీర, చిన్న కీర పండిస్తున్నారు. జిల్లా అవసరాలకు సరిపడే కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది.

# ఆర్టీసీకి రూ.128 కోట్ల ఆదాయం!!




జనగామ : ఆర్టీసీకి సెలవులు ఎంతగానో కలిసొ చ్చాయి. మే నెలలో ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలు ఎక్కువగా జరిగాయి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు ఇంటిల్లిపాది ప్రయాణాలు చేశారు. ఫలితంగా ఆర్టీసీకి ఆశించిన దానికంటే అధికంగానే ఆదాయం సమకూరింది. ఏప్రిల్, మే, జూన్ (21వతేదీ వరకు) రూ. 128 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ఒక్క మే నెలలోనే రూ.51 కోట్ల ఆదాయం రావడం విశేషం. గతేడాది మేలో రూ. 40.24కోట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి అదనంగా రూ.11.కోట్లు రావడం ఆర్టీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

100 రోజుల ఛాలెంజ్..

ఆర్టీసీ యాజమాన్యంతో పాటు రీజియన్ అధికారులు వేసవి సెలవుల నేపథ్యంలో గత మార్చి నుంచే 100 రోజుల ఛాలెంజ్ కార్యక్రమాన్ని చేపట్టి సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. రద్దీ సమయాల్లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకొని ఓ.ఆర్ శాతాన్ని పెంచారు. విహార యాత్రల కోసం చాలా మంది దూర ప్రయాణాలు చేశారు. రీజియన్‌లోని పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే వారికి రాయితీ అవకాశం కల్పించారు. బెంగళూరు, హైదరాబాద్, పుణె లాంటి దూర ప్రాంతాలకు ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఫలితంగా ఆదాయం పెరిగింది.అందరి కృషి ఫలితమే జె.శ్రీలత, ఆర్టీసీరీజనల్ మేనేజర్ రీజియన్‌లోని అన్ని డిపోల సిబ్బంది ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి ఫలితంగానే అనుకున్న లక్ష్యాలను సాధించగలిగాం. ఉన్నతాధికారుల సూచనలను పాటించాం. 100 రోజల కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. కండక్టర్లు, డ్రైవర్లు సంస్థ నిర్ణయించిన లక్ష్యాలను చేరుకున్నారు. వారిలో ఉత్సాహం మరింత పెరిగింది. వేసవి సెలవులను, వివాహాది శుభాకార్యాలను సంస్థ వినియోగించుకుంది. ఆదాయం తీసుకురావడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేస్తున్నాం.

# పశువులకు మేత కరవు

ఎల్లారెడ్డిపేట : జిల్లాలో ఈ ఏడాది పశుగ్రాసం కొరత తీవ్రంగా నెలకొంది. రైతులు వరి కోతల తర్వాత గడ్డిని సేకరించి, నిల్వ చేసి పశువులకు మేతగా అందిస్తుంటారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో ఈ యాసంగి సీజన్‌లో వరి కోతల కోసం అత్యధికంగా ట్రాక్ వరికోత యంత్రాలను వినియోగించడం వల్ల వరిగడ్డి చేతికందకుండా పోయింది. పశుగ్రాసం దిగుబడి భారీగా తగ్గిపోయింది. పశువులను కాపాడుకునేందుకు ఎండుగడ్డి సేకరణపై అన్నదాతలు ప్రత్యేక దృష్టి సారించారు. వ్యయప్రయాసలకోర్చి చుట్టుపక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 1,72,465 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు చేశారు. అందులో అత్యధికంగా వరి 1,70,451 ఎకరాల్లో వేశారు. మిగతా పంటలైన మొక్కజొన్న 744, గోధుమ 88, నువ్వు 152, పొద్దుతిరుగుడు 304, శనగ 375 ఎకరాల్లో సాగు చేశారు. 287 ఎకరాల్లో ఇతర పంటలను వేశారు. పంట చేతికందగానే అవశేషంగా మిగిలే వరి, మొక్కజొన్నను పశువులకు ప్రధాన మేతగా వినియోగిస్తుంటారు. అయితే వరి కోతల సమయంలో అకాల వర్షాలు కురవడంతో కమతాలు తడిగా మారాయి. సాధారణ వరి కోత యంత్రాలు నడవకపోవడంతో ఫోర్‌వీలర్, ట్రాక్ వరికోత మిషన్ల వినియోగం పెరిగింది. దీంతో పశుగ్రాసం చేతికందకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో టన్ను నుంచి 1.5 టన్నుల వరకు ఎండు వరిగడ్డి లభిస్తుందని అంచనా. వరి గడ్డి దిగుబడి తగ్గిపోవడంతో పశుపోషణ భారంగా మారింది. వరిగడ్డి సేకరణ పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వృథా కాకుండా...ఆవులు, ఎద్దులు, గేదెలకు వరిగడ్డి మేతగా ఉపయోగపడుతుంది. గ్రాసం వృథా కాకుండా ఉండేందుకు యంత్రాల సహాయంతో కట్టలుగా మార్చడం కోసం ఒక్కో వరిగడ్డి కట్టకు రూ. 35 వరకు ఖర్చు పెడుతున్నారు. ఈ వరిగడ్డి వర్షాలకు తడవకుండా వాములుగా పేర్చి ఇళ్ల పరిసరాలు, వ్యవసాయ పొలాల్లో నిల్వ చేసుకుంటున్నారు. అనేక మంది రైతులు పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని వరిగడ్డికి రూ. 5 వేల నుంచి రూ.6 వేల వరకు వెచ్చిస్తున్నారు. ముమ్ముందు పశుగ్రాసం కొరత సమస్యను అధిగమించేందుకు ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. ఈ వానాకాలంలో జిల్లాలో ఈ ఏడాది జూన్ వరకు 1.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరమవుతుండగా 0.45 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అదనంగా ఉన్నట్లు పశుపోషణశాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. జనవరిలో జిల్లా వ్యాప్తంగా కేవలం 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌జి–59 రకం పశుగ్రాసం విత్తనాలను ప్రభుత్వం 75 శాతం రాయితీపై పంపిణీ చేసినట్లు పేర్కొంటున్నారు. కాగా మరో రెండు నెలల వరకు పశువులకు పచ్చిగడ్డి లభించదని, దీంతో ముందు జాగ్రత్తగా వరి గ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. పశువులకు బలవర్ధకమైన మేతను అందించడం కోసం ప్రభుత్వం పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలంటున్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు, ఇతర దాణా సరఫరా చేయాలని కోరుతున్నారు.

కొరత లేదు– డాక్టర్ కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి

పశుగ్రాసం కొరత లేదు. వరి కోతల తర్వాత రైతులు ఎండుగడ్డిని కాల్చివేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతుంది.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం– డాక్టర్ రేణుక, పశువైద్యాధికారి, ఎల్లారెడ్డిపేటపశుపోషణలో రైతులు మెలకువలు పాటించాలి. లీటరు పాలు ఉత్పత్తి జరగాలంటే పాలిచ్చే ఆవు, గేదెకు రోజూ 2.5 కిలోల దాణా, 40 కిలోల పచ్చిమేత, 5 కిలోల ఎండుమేతను విధిగా అందించాలి. మూడు నెలల వయసు తర్వాత దూడలకు పచ్చిమేత వేయాలి. గర్భం దాల్చిన పశువులకు రెండు కిలోల దాణాతోపాటు 35 కిలోల పచ్చిగడ్డి, 5 కిలోల వరిగడ్డిని ఇవ్వాలి. పాల ఉత్పత్తిలో వెన్నశాతం తగ్గిపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీన్ని అధిగమించేందుకు దాణా పరిమాణంలో 0.5 శాతం ఉప్పు కలిపితే పశువుల్లో సోడియం క్లోరైడ్, ఫాస్ఫరస్ స్థాయిలు పెరిగి, రుచికరమైన పాలు ఉత్పత్తి అవుతాయి.

# క్రీడా పాఠశాల పిలుస్తోంది !

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 2023–24 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. క్రీడా పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించే వీలుంటుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

మేడ్చల్ జిల్లా హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లో ప్రాంతీయ క్రీడా పాఠశాలలు ఉన్నాయి. 4, 5 తరగతులలో ప్రవేశాలు కల్పిస్తారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రతీ పాఠశాలలో 4వ తరగతిలో 40, 5వ తరగతిలో 40 విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 50 శాతం సీట్లు బాలికలకు కేటాయించారు.

వివిధ స్థాయిలో సామర్థ్య పరీక్షలు ..

మండల స్థాయి ఎంపిక పోటీలు జులై 1 నుంచి 5 వరకు ఎంఈవోల పర్యవేక్షణలో జరుగుతాయి. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లా స్థాయి పోటీలకు అర్హులవుతారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, 3,4 తరగతుల స్టడీ సర్టిఫికెట్లు. రెండు పాస్‌పోర్టు ఫొటోలు వెంట తెచ్చుకోవాలి. జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు జులై 9 నుంచి 15 వరకు జిల్లా క్రీడాశాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తేనే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారు.రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు జులై 24 నుంచి 30 వరకు మేడ్చల్ జిల్లా హకీంపేట క్రీడా పాఠశాలలో జోన్ల వారీగా జరుగుతాయి. ఆగస్టు చివరి వారంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఐదో జోన్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగామ జిల్లాలకు సంబంధించి జులై 28న ఎంపిక సామర్థ్య పరీక్షలు ఉంటాయి. ఇందుకు గాను ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారు ఎంపిక సామర్థ్య పోటీలకు ముందు రోజు(జులై 27న) మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

అర్హతలు..4వ తరగతిలో చేరగోరే వారు 1 సెప్టెంబరు 2013 నుంచి 31 ఆగస్ట్ 2014 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశం పొందేనాటికి 2022–23 సంవత్సరంలో 3వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. 5వ తరగతిలో చేరగోరు వారు 1 సెప్టెంబరు 2012 నుంచి 31 ఆగస్ట్ 2013 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశం పొందే నాటికి 2022–23 సంవత్సరంలో 4వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎముకలు విరిగిన వారు, ప్లాట్‌ఫీట్, దొడ్డి కాళ్లు, వెన్నెముక వంగి ఉన్నవారు, బౌలెగ్స్ ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు అనర్హులు.




# అయోధ్యకు మన రాముడొచ్చేశాడు: ప్రధాని మోదీ

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో బాలరాముడు కొలువుదీరాడు. సోమవారం మధ్యాహ్నం రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవం అనంతరం ప్రధాని మోదీ (%ావీ ఏశీఎఱ%) ప్రసంగించారు. 'జై సియా రామ్' అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. మన రామ్‌లల్లా ఇక టెంట్‌లో ఉండాల్సిన అవసరం లేదని, దివ్యమందిరంలో కొలువుదీరారని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు.

**కొత్త కాలచక్రానికి ప్రతీక..** "పవిత్రమైన అయోధ్యాపురికి శిరసు వంచి నమస్కరిస్తున్నా. ఈ రోజు రామ భక్తులంతా ఆనంద పరవశంలో ఉన్నారు. ఎన్నో బలిదానాలు, పోరాటాలు, త్యాగాల తర్వాత మన రాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు. ఈ శుభ గడియల్లో ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఈ కార్యం ఆలస్యమైనందుకు క్షమించమని రాముడిని వేడుకుంటున్నా. జనవరి 22, 2024.. ఇది కేవలం తేదీ మాత్రమే కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక. ఈ సమయానికి పరిపూర్ణ దివ్యత్వం ఉంది. కొన్ని వందల ఏళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తుంచుకుంటారు. ఈ క్షణం కోసం అయోధ్య ప్రజలు వందల ఏళ్లుగా నిరీక్షించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దశాబ్దాల పాటు న్యాయపోరాటం చేశాం. ఇన్నేళ్లకు మన స్వప్నం సాకారమైంది. శ్రీరాముడి ఆశీస్సులతో ఈ అద్భుత ఘట్టంలో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ రోజు దేశమంతా దీపావళి జరుపుకుంటోంది. ఈ రాత్రికి ప్రతి ఇంటా రామజ్యోతి వెలగాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

**రాముడు వివాదం కాదు.. సమాధానం..** రామాలయ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయని, కానీ, చివరకు న్యాయమే గెలిచించిందని ప్రధాని ఈ సందర్భంగా తెలిపారు. ఇందుకు న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. "ఈ శుభ గడియల కోసం 11 రోజుల దీక్ష వహించా. రాముడితో అనుబంధం ఉన్న క్షేత్రాలన్నీ సందర్శించా. ఏపీలోని లేపాక్షి ఆలయం, తమిళనాడులోని రామేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నా. సాగర్ నుంచి సరయూ వరకు రామనామం జపించా. ఈ క్షణం దేశ ప్రజల సహనం, పరిపక్వతకు నిదర్శనం. ఇది మన విజయానికే కాదు.. వినయానికి కూడా సూచిక. కొందరు వ్యక్తులు మన సమాజ ఆత్మను అర్థం చేసుకోలేకపోయారు. రామనామం ఈ దేశ ప్రజల కంకణంలో నిండి ఉంది. మన దేశ సంస్కృతి కట్టుబాట్లకు రాముడే మూలం. ఆయన ఆదర్శం, విలువలు, క్రమశిక్షణ మనకు శిరోధార్యం. ఇది విగ్రహ ప్రాణ ప్రతిష్ఠే కాదు.. మన విశ్వాసాలకు ప్రాణప్రతిష్ఠ. రాముడు వివాదం కాదు సమాధానం. రాముడు అగ్ని కాదు.. వెలుగు. రాముడే భారత్ ఆధారం. ఆయనే భారత్ విధానం. రాముడే నిత్యం.. ఆయనే నిరంతరం. రాముడే విశ్వం.. ఆయనే విశ్వాత్మ" అని మోదీ కొనియాడారు.

**త్రేతాయుగంలో ఉన్నట్లుగా ఉంది: ఆదిత్యనాథ్ –** అంతకుముందు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రసంగించారు. "500 ఏళ్ల కల నెరవేరింది. అనుకున్న చోటే రామాలయం నిర్మించాం. ఎన్నో ఏళ్ల పోరాటాల తర్వాత ఈ అద్భుత ఘట్టం సాకారమైంది. ఈ ఆనందాన్ని నేను మాటల్లో వర్ణించలేను. ఈ క్షణం కోసం దేశమంతా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసింది. ప్రాణప్రతిష్ఠతో దేశమంతా రామమయంగా మారింది. త్రేతాయుగంలో ఉన్నట్లుగా అనిపిస్తోంది. అయోధ్య ప్రపంచ సాంస్కృతిక రాజధానిగా వర్ధిల్లుతుంది. మోదీ దూరదృష్టి, అంకితభావంతోనే ఇదంతా సాధ్యమైంది. అయోధ్యకు పూర్వవైభవం తెచ్చేందుకు రూ. వందల కోట్లు కేటాయించారు. రాముడు మనకు ఓర్పు బోధించారు. ఈ ప్రాణప్రతిష్ఠ వేడుకను తిలకించిన ఈ తరం ఎంతో అదృష్టవంతులు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రామరాజ్యాన్ని సాకారం చేస్తుంది. ఇందులో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు" అని సీఎం ఆనందం వ్యక్తం చేశారు.




అయోధ్య: ఈ భూమ్మీద తన కంటే అదృష్టవంతులు ఎవరూలేరని రామ్‌లల్లా విగ్రహ రూపకర్త అరుణ్ యోగిరాజ్ అమితానందం వ్యక్తం చేశారు.

ఈ మైసూరు శిల్పి తయారుచేసిన విగ్రహాన్ని అయోధ్యలో ప్రాణప్రతిష్ఠకు ఎంపిక చేయగా.. అది ఈ రోజు ఆలయంలో కొలువుతీరింది. 'ఈ క్షణం ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే అనే భావన కలుగుతోంది. నా పూర్వీకులు, కుటుంబ సభ్యులు, రామ్‌లల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతో ఉంటాయి. ఒక్కోసారి ఇదంతా కలలా అనిపిస్తుంది' అని మీడియా ఎదుట ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ముగ్గురు శిల్పులు వేర్వేరు శిలలతో రాముడి శిల్పాలను చెక్కగా అందులో ఒక్క విగ్రహాన్ని గర్భగుడికోసం ఎంపిక చేశారు. అది యోగిరాజ్ చెక్కినది. మిగిలినవాటిని కూడా ఆలయంలోనే ఇతర ప్రాంతాల్లో ఉంచుతారు. రామ్‌లల్లా అని భక్తులు పిలుచుకునే ఈ చిన్నారి రాముడి విగ్రహాన్ని 51 అంగుళాల ఎత్తుతో(దాదాపు 4.25 అడుగులు) ఆకర్షణీయమైన కృష్ణశిలతో తీర్చిదిద్దారు. శ్రీరామనవమి రోజున సూర్యకిరణాలు రాముడిపై ప్రసరించే విధంగా ఈ విగ్రహం ఎత్తును నిర్ణయించారు. ఈ రోజు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ ప్రాణప్రతిష్ఠ క్రతువు పూర్తయింది.




గువహాటి: 'భారత్ జోడో న్యాయ యాత్ర 'లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం అస్సాంలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నగావ్ జిల్లాలోని బతద్రవ సత్ర ఆలయాన్ని సందర్శించకుండా అధికారులు అడ్డుకున్నారని రాహుల్ ఆరోపించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. తనను అడ్డుకోవడానికి గల కారణమేంటని సిబ్బందిని ప్రశ్నించారు. గుడిలోకి ఎవరు ప్రవేశించాలనేది ఇప్పుడు ప్రధాని మోదీ నిర్ణయిస్తున్నారని విమర్శలు చేశారు. 'మేం ఆలయాన్ని దర్శించుకోవాలనుకున్నాం. ఇక్కడకు రాకూడనంత నేరం నేనేమీ చేశాను..? మేం ఇక్కడకు వచ్చింది ప్రార్థించడానికి.. ఎలాంటి సమస్యలు సృష్టించడానికి కాదు' అని రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఇదిలా ఉండగా.. తన యాత్ర మార్గంపై ఒకసారి పునరాలోచించుకోవాలని ఆదివారం రాహుల్‌ను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కోరారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ నేపథ్యం ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ అభ్యర్థన చేశారు. అస్సాంలోని 17 జిల్లాల మీదుగా 833 కి.మీ. మేర జనవరి 25 వరకు రాహుల్ యాత్ర కొనసాగనుంది. బతద్రవ సత్ర.. శ్రీమంత శంకరదేవ జన్మస్థలం. ఆయన 15వ శతాబ్దానికి చెందిన సాధువు.




# అంగన్వాడీలకు ఏపీ సర్కార్ బిగ్ షాక్

అమరావతి, జనవరి 22: తమ సమస్యల పరిష్కారం కోసం గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఏపీ ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. సమ్మె చేస్తున్న అంగన్వాడీలను తొలగించాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విధులకు హాజరుకాని అంగన్వాడీలను ఈరోజు (సోమవారం) సాయంత్రానికి తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని సర్కార్ ఆదేశించింది. అంగన్వాడీలు విజయవాడకి రావడంతో వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆర్డర్ జారీ చేసింది. ఇప్పటికే అంగన్వాడీల సమ్మెపై ఏపీ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఎస్మా చట్టంలోని నిబంధనలు ప్రకారం ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చింది. ప్రభుత్వ నోటీసులకు అంగన్వాడీలు రిప్లై ఇవ్వగా దాని పట్ల సంతృప్తి చెందలేదని అధికారులు చెబుతున్నారు. కాగా.. అంగన్వాడీలతో పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లను నెరవేర్చేవరకు సమ్మెను కొనసాగిస్తామంటూ అంగన్వాడీలు పట్టుబట్టారు. సమ్మెలో భాగంగా ఈరోజు ఛలో విజయవాడకు అంగన్వాడీలు పిలుపునివ్వడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ క్రమంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెపై ఏపీ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

**కథం తొక్కిన అంగన్వాడీలు.. ఉద్రిక్తం..** ఇప్పటికే చలో విజయవాడలో భాగంగా నగరంలోని పలుప్రాంతాల్లో అంగన్వాడీలు కథం తొక్కారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని మరీ పలు జిల్లాల నుంచి అంగన్వాడీలు విజయవాడకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు జిల్లాల్లో అంగన్వాడీలను తొలగిస్తూ కలెక్టర్లు ఆర్డర్స్ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులపై అంగన్వాడీ ఉద్యమ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలగింపు ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తామని అంగన్వాడీ ఉద్యమ నేతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1 లక్ష 06 వేల మంది అంగన్వాడీలు ఉండగా.. వీరిలో కేవలం 10 శాతం మంది మాత్రమే విధుల్లో చేరినట్టు ఉద్యమ నేతలు చెబుతున్నారు.

# అయోధ్య వేదికగా.. చంద్రబాబు- మాజీ సీజేఐ ఎన్వీ రమణ మధ్య చర్చలు

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామచంద్రుడు.. తన జన్మస్థలంలో కొలువుదీరాడు. నగుమోముతో బాల రాముడిగా కనులవిందుగా భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఈ మధ్యాహ్నం 12:29 నిమిషాలకు ప్రాణ ప్రతిష్ట ప్రక్రియ ఆరంభమైంది. 12:31 నిమిషాలకు పూర్తయింది. మొత్తం 86 సెకెండ్ల వ్యవధిలో ఈ కార్యక్రమాన్ని ముగించారు అర్చకులు. అభిజిత్ ముహూర్తంలో రామ్ లల్లా విగ్రహానికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రక్రియ కొనసాగింది. మోదీతో పాటు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనంది బెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అయోధ్య ఆలయ ప్రధాన అర్చకుడు సత్యేంద్రనాథ్ మాత్రమే గర్భగుడిలోనికి ప్రవేశించారు. రాములవారికి తొలి పూజలు చేశారు. విగ్రహం కళ్లకు కట్టిన వస్త్రాన్ని మోదీ తొలగించారు. కాటుకను పూశారు. అయోధ్య ఆలయం ప్రధాన అర్చకుడు సత్యేంద్రనాథ్, వారణాశి కాశీ విశ్వనాథ ఆలయం ప్రధాన అర్చకుడు లక్ష్మీకాంత్ దీక్షిత్.. సారథ్యంలో 121 మంది అర్చకులు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు



చంద్రబాబు నాయుడు ఈ ఉదయం అయోధ్యకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమర్చిన వీఐపీ గ్యాలరీలో తొలి వరుసలో కూర్చున్నారు. రామమందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని అసాంతం తిలకించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం చంద్రబాబు.. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను కలిశారు. సుమారు అరగంట పాటు మాట్లాడారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలు వారి మధ్య ప్రస్తావనకు వచ్చాయి. పదవీ విరమణ చేసిన అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ ఢిల్లీలో నివసిస్తోన్న విషయం తెలిసిందే.

# అంగన్వాడీల 'చలో విజయవాడ'తో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు: లోకేశ్

అమరావతి: ఓవైపు తాను వదిలిన బాణం తిరిగి తనవైపే దూసుకురావడం, మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటుతో మతిభ్రమించిన సీఎం జగన్ విచక్షణ కోల్పోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. పిచ్చివాడి చేతిలో రాయి అటు, ఇటు తిరిగి న్యాయమైన డిమాండ్ల కోసం 42 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీల వైపు మళ్లిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం నియంతృత్వ పోకడలకు అద్దం పడుతోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాటాకు చప్పుళ్లకు లొంగని అంగన్వాడీలు 'చలో విజయవాడ'కు పిలుపునివ్వడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు చెలరేగుతున్నాయని లోకేశ్ అన్నారు. వారికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా సంఘీభావం తెలియజేస్తోందన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం మూర?పు చర్యలను విడనాడి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. జగన్ ప్రభుత్వం




తొలగించే అంగన్వాడీలను తెదేపా – జనసేన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎటువంటి సర్వీసు అంతరాయం లేకుండా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# రంగంలోకి షర్మిల.. నేటి నుంచి జిల్లాల పర్యటన.. షెడ్యూల్ ఇదే



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రంగంలోకి దిగారు. పీసీసీ అధ్యక్షురాలిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆమె జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంతో ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు పర్యటించనున్నానారు. ఈ మేరకు ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల షెడ్యూల్ ఖరారయ్యింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యత షర్మిల భుజాలపై పడింది. క్షేత్రస్థాయిలో అందరిని కలుపుకొని వెళుతున్నారు. పార్టీలోకి కీలక నేతలను తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. యువతరం నేతలతో షర్మిల చర్చిస్తున్నారని తెలిసింది. వైఎస్ఆర్‌తో అనుబంధం గల నేతలతో కేవీపీ చర్చలు జరుపుతున్నారని సమాచారం. కొత్త, పాత తరం నేతల కలయికతో పార్టీని బలోపేతం చేయాలని షర్మిల భావిస్తున్నారు. ఈ నెల 23వ తేదీన (మంగళవారం) శ్రీకాకుళం జిల్లా నుంచి షర్మిల పర్యటన ప్రారంభం అవుతుంది. ఆ రోజున పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో పర్యటిస్తారు. ఆ మరునాడు విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో స్థానిక నేతలతో సంప్రదింపులు జరుపుతారు. 25వ తేదీన కాకినాడ, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలు, 26వ తేదీన తూర్పు గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, 27వ తేదీన కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలు, 28వ తేదీన బాపట్ల, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, 29వ తేదీన తిరుపతి, చిత్తూర్, అన్నమయ్య జిల్లా, 30వ తేదీన శ్రీ సత్య సాయి, అనంతపురం, కర్నూలు జిల్లాలు, 31వ తేదీన నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాలో షర్మిల పర్యటన కొనసాగుతుంది. ఇడుపులపాయతో షర్మిల పర్యటన ముగియనుంది.

# అంగన్వాడీల చలో విజయవాడతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు

అమరావతి, జనవరి 22: అంగన్వాడీల చలో విజయవాడతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. అంగన్వాడీలపై జగన్ రెడ్డి తీరు దుర్మార్గమని మండిపడ్డారు. ఏపీలో ప్రజాస్వామ్యాన్ని జగన్ రెడ్డి పాతరేశారన్నారు. రాష్ట్రంలో తన సొంత జాగీరులా జగన్ రెడ్డి భావిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తే నేరమా అని ప్రశ్నించారు. అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించే అధికారం జగన్ రెడ్డికి ఎవరిచ్చారని నిలదీశారు. ఆచం సునీతను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంగన్వాడీల కన్నీటిలో జగన్ రెడ్డి కొట్టుకుపోవడం ఖాయమని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.



# అరెస్టులతో అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేరు

విజయవాడ: ఏపీ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిందని అంగన్వాడీ ఏపీ అధ్యక్షురాలు బేబీ రాణి అన్నారు. సోమవారం నాడు ఆమె మీడియాతో మాట్లాడుతూ... దీక్షలో కూర్చున్న అంగన్వాడీలను అర్ధరాత్రి అన్యాయంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. మహిళలని చూడకుండా రోడ్డుపై ఈడ్చి పారేసిన చర్యలను ఖండిస్తున్నామన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కోటి సంతకాల సేకరించి సీఎం జగన్‌కు అందించాలని భావించామని తెలిపారు. కనీసం సీఎంను కలిసే అవకాశం కూడా లేకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. తమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు.ఎన్ని అరెస్టులు చేసినా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. తమను అనేక పోలీస్ స్టేషన్లకు తరలించినా అక్కడ కూడా అంగన్వాడీలందరూ ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. ఎంత దూరం వదిలేసినా మళ్లీ విజయవాడ వచ్చి ఉద్యమం కొనసాగించి తీరుతామని స్పష్టం చేశారు.

**పోలీసులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు** : అంగన్వాడీ మహిళలందరూ కూడా ఇళ్లకు వెళ్లవద్దని చెప్పారు. ఎక్కడ అయితే అరెస్టులో ఉన్నారో అక్కడే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ నుంచి వదిలిన వెంటనే మళ్లీ విజయవాడ తరలిరావాలని కోరుతున్నామన్నారు. తమ ఉద్యమాన్ని అణచి వేయాలని పోలీసులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నేతల దగ్గర తాము కోట్ల రూపాయలు వసూళ్లు చేస్తున్నామని.. పోలీసులు చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఆ కోటి వాళ్లకే ఇస్తామని సవాల్ విసిరారు. పోలీసులు చేస్తున్న ప్రచారాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలను తొలగించి, ఇరవై వేల మందిని కొత్తగా నియమించామని అబద్దాలు చెబుతున్నారన్నారు. తమ ఉద్యమాల వెనుక ఎలాంటి రాజకీయ శక్తులు లేవని చెప్పారు. కార్మిక, మహిళా శక్తి మాత్రమే ఉందన్నారు. హక్కులు సాధించుకునే వరకు ఈ పోరాటం ఉద్యమం కొనసాగుతుందని బేబీ రాణి స్పష్టం చేశారు.

# జాన్వీ కపూర్.. మరో రేంజ్ కి వెళ్లే ఆఫర్?

అతిలోక సుందరి శ్రీదేవి కూతురు, బాలీవుడ్ హీరోయిన్ జాన్వి కపూర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'ధడక్' సినిమాతో బాలీవుడ్ కి హీరోయిన్ గా పరిచయమైన ముద్దుగుమ్మ ఆ తర్వాత 'గుంజన్ సక్సేనా, రూహి, మిలీ వంటి సినిమాల్లో నటించి హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇక ఇప్పుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' సినిమాతో తెలుగు వెండితెరకి ఆరెంగేట్రం చేస్తోంది. ఈ సినిమాలో పల్లెటూరి అమ్మాయిగా 'తంగం'అనే పాత్రలో కనిపించబోతోంది. ఇప్పటికే దేవర నుంచి జాన్వి కపూర్ ఫస్ట్ లుక్ సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. ఇదిలా ఉంటే సౌత్ లో జాన్వీ కపూర్ నటిస్తున్న ఫస్ట్ మూవీ రిలీజ్ కాకముందే మరో ప్రాజెక్టులో నటించే ఛాన్స్ కొట్టేసింది. తాజా సమాచారం ప్రకారం జాన్వి కపూర్ సౌత్ లో తన రెండవ ప్రాజెక్టుగా ఓ తమిళ మూవీ సైన్ చేసినట్లు తెలుస్తోంది. కోలీవుడ్ స్టార్ సూర్య హీరోగా తెరకెక్కి పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో జాన్వి కపూర్ ని హీరోయిన్ గా తీసుకున్నట్లు కోలీవుడ్ మీడియా నుంచి వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై మేకర్స్ నుంచి ఇంకా అఫీషియల్ కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది. బాలీవుడ్ దర్శకుడు రాకేష్



మెహార కర్ణ అనే సినిమా తీయాలని ప్లాన్ చేస్తున్నారు. మహాభారతంలోని కర్ణుడి పాత్ర ఆధారంగా ఈ సినిమాను ఈ సినిమాని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ఇందులో కోలీవుడ్ స్టార్ సూర్యని హీరోగా తీసుకునే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. అంతేకాకుండా ఇందులో కర్ణుడి భార్య పాత్రలో బాలీవుడ్ బ్యూటీ జాన్వి కపూర్ ని తీసుకోబోతున్నట్లు చెబుతున్నారు. సౌత్ లో మొదటి సినిమాతోనే ఎన్టీఆర్ లాంటి హీరోతో నటించే ఛాన్స్ అందుకున్న జాన్వికపూర్ ఇప్పుడు కోలీవుడ్ లో సూర్య లాంటి స్టార్ హీరో సరసన నటించే ఛాన్స్ అందుకోవడం విశేషం అనే చెప్పాలి. ఇక సూర్య ప్రస్తుతం 'కంగువ' అనే భారీ పాన్ ఇండియా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. తమిళ దర్శకుడు శివ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని హీరోయిన్ గా నటిస్తోంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. %ఖు% క్రియేషన్స్ సంస్థ నిర్మాణ భాగస్వామి. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# అమితాబ్, కమల్ తో పాటు దేవరకొండ కూడా..!

తెలుగు ప్రేక్షకులతో పాటు పాన్ ఇండియా సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రభాస్ 'కల్కి' సినిమా విడుదల తేదీ వచ్చేసింది. ఈ ఏడాది మే 9న కల్కి సినిమాను విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సినిమాలో ఎంతో మంది స్టార్స్ కీలక పాత్రల్లో, అతిథి పాత్రల్లో కనిపించబోతున్నారు. అమితాబచ్చన్, కమల్ హాసన్ లు నటిస్తున్నట్లుగా ఇప్పటికే అధికారికంగా యూనిట్ సభ్యులు ప్రకటించారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ దీపికా పదుకునే మరియు దిశా పటానీ లు నటిస్తున్న విషయం తెల్సిందే. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా నటిస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. కల్కి సినిమాలో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడనే వార్తలు జోరుగా వస్తున్నాయి. ఎవడే సుబ్రమణ్యం సినిమా తో విజయ్



దేవరకొండ కి మంచి గుర్తింపు వచ్చింది. నాగ్ అశ్విన్ వల్లే ఆ సినిమా లో విజయ్ కి చోటు దక్కింది. ఆ తర్వాత నాగ్ అశ్విన్ రూపొందించిన మహానటి సినిమాలో కూడా విజయ్ దేవరకొండ నటించిన విషయం తెల్సిందే. నాగ్ అశ్విన్ ప్రతి ప్రాజెక్ట్ లో కూడా విజయ్ దేవరకొండ కంటిన్యూ అవుతున్నాడు. ఆ సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. కనుక కల్కి లో కూడా విజయ్ దేవరకొండ ఉంటే సెంటిమెంట్ వర్కౌట్ అయ్యి విజయాన్ని సొంతం చేసుకుంటుందనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభాస్, అమితాబ్, కమల్, దుల్కర్ వంటి స్టార్స్ తో పాటు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా కల్కి లో నటించడం వల్ల కచ్చితంగా సినిమా స్థాయి మరింతగా పెరుగుతుంది. ఖుషి తో సక్సెస్ జోష్ లో ఉన్న విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ తో సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆ వెంటనే కల్కి తో కూడా రౌడీ స్టార్ తన ఫ్యాన్స్ ని అలరించబోతున్నాడు.




# సూపర్ స్టార్ సినిమాను పట్టించుకోరేంటి..!




ఇండియన్ సూపర్ స్టార్స్ లో ఒకరైన మోహన్ లాల్ కి కేవలం మలయాళంలోనే కాదు పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ ఉంది. మలయాళ సీనియర్ స్టార్ గా ఆయన చేస్తున్న సినిమాలు అక్కడ బాక్సాఫీస్ పై మంచి ఫలితాలు అందిస్తున్నాయి. మన దగ్గర కూడా 90వ దశకంలో మోహన్ లాల్ డబ్బింగ్ సినిమాలు ఆకట్టుకున్నాయి. ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ మనమంతా సినిమాతో డైరెక్ట్ తెలుగు సినిమా చేసిన మోహన్ లాల్ ఆ సినిమాతో ఆశించిన ఫలితం అందుకోలేదు కానీ ఎన్.టి.ఆర్ తో చేసిన జనతా గ్యారేజ్ సినిమా మాత్రం సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత మలయాళంలో చేసిన లూసిఫర్ అక్కడ సెన్సేషనల్ హిట్ కాగా ఆ సినిమాను తెలుగులో కూడా అనువదించి రిలీజ్ చేశారు. ఆ సినిమాకు కూడా తెలుగు ఆడియన్స్ పట్టించుకోలేదు. ఇక లేటెస్ట్ గా మలైకొట్టయి వాలిబన్ అనే సినిమా చేశారు మోహన్ లాల్. ఈ సినిమాను పాన్ ఇండియా లెవెల్ లో జనవరి 25న రిలీజ్ చేస్తున్నారు. లిజో జోస్ పెల్లిషెర్రీ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్ చూస్తే విజువల్ గ్రాండియర్ గా అనిపిస్తుంది. అయితే ఈ సినిమా తెలుగు రిలీజ్ ని అంతగా పట్టించుకోవట్లేదు ఆడియన్స్. సంక్రాంతికి మిస్ అయ్యిందని జనవరి 25నే ధనుష్ కెప్టెన్ మిల్లర్, శివ కార్తికేయన్ అయలాన్ సినిమాలు కూడా తెలుగులో రిలీజ్ అవుతున్నాయి. హృతిక్ రోషన్ ఫైటర్ కూడా ఆరోజు రిలీజ్ అవుతుంది. ఈ సినిమాల మధ్య మోహన్ లాల్ సినిమా ఎక్కడ కనిపించట్లేదు. మోహన్ లాల్ సోలో రిలీజ్ లకు తెలుగులో పెద్దగా క్రేజ్ రావట్లేదు. అందుకే రాబోతున్న ఈ సినిమాకు కూడా ప్రేక్షకులు ఆసక్తి చూపించట్లేదు. ఇదే కాకుండా సంక్రాంతి సినిమాల సందడి ఇంకా కొనసాగుతూనే ఉంది. వీటి మధ్యలో మలైకొట్టై వాలిబన్ సినిమా ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుంది అన్నది చూడాలి. ఈ సినిమా తెలుగులో భారీగా రిలీజ్ చేస్తే హైదరాబాద్ వచ్చి ప్రమోట్ చేసేందుకు మోహన్ లాల్ రెడీ అవుతున్నారని తెలుస్తుంది. సినిమా రిలీజ్ అయ్యి హిట్ టాక్ వస్తే తెలుగు ఆడియన్స్ ఆ సినిమా మీద ఆసక్తి చూపిస్తారు కానీ ఎలాంటి బజ్ లేకపోతే మాత్రం సినిమాను ఆదరించడం కష్టం. మరి మోహన్ లాల్ సినిమా తెలుగు రిలీజ్ ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందో చూడాలి.

# దేవరకి పోటీగా ఆ ఇద్దరు బరిలోకి




యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య 'దేవర' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 'ఆర్ ఆర్ ఆర్' తర్వాత తారక్ నుంచి రిలీజ్ అవుతోన్న తొలి సోలో పాన్ ఇండియా రిలీజ్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రిలీజ్అ యిన ప్రచార చిత్రాల అన్ని భాషల్లోనూ సంచలనమవుతున్నాయి. తారక్ లుక్..కంటెంట్ అందులో పాత్రలు ఎలా ఉంటాయి అన్నది కొరటాల ముందుగానే రివీల్ చేసేసారు. దీంతో ఆ పాత్రలు ఎంతటి రా అండ్ రస్టిక్ గా మలిచి ఉంటార న్నది గెస్ చేయొచ్చు. కొరటాల మాస్ మార్క్ ని మించి ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇదే సినిమాతో సరికొత్త కొరాటాలని చూస్తామని తెలుస్తుంది. అటు 'వార్ -2'తో యంగ్ టైగర్ బాలీవుడ్ లోనూ లాంచ్ అవ్వడం అన్నది 'దేవర'కి కలిసొచ్చిన అంశం గా కలిసొస్తుంది. ఇలాంటి అంచనాల మధ్య హిందీలోనూ సినిమా పెద్ద ఎత్తున రిలీజ్ అవుతుంది. ఇప్ప టికే పాన్ ఇండియాలో ఏప్రిల్ 5న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా అదే తేదికి రిలీజ్ అవ్వడం ఖాయం. ఇప్పటికే సినిమా షూటింత్ కూడా 85 శాతం పూర్తయింది. దీంతో ప్రకటించిన తేదీకి దేవర దిగపోవడం దాదాపు ఖాయంగానే కనిపిస్తుంది. అయితే ఇదే సమయంలో ఇద్దరు స్టార్ హీరోలు దేవరకి పోటీగా దిగుతున్నారు. ఆ ఇద్దరు యంగ్ టైగర్ మీదకి కలిసి రావడం విశేషం. ఇంతకీ ఎవరా హీరోలు? ఏంటా సినిమా అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. ఖిలాడీ అక్షయ్ కుమార్- టైగర్ ష్రాఫ్ కలిసి 'బడేమియా చోటే మియా' అనే చిత్రంలో నటిస్తున్నారు. అలీ అబ్బాస్ డైరెక్ట్ చేస్తున్న చిత్రమిది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఇదే సినిమా ఏప్రిల్ 9 లేదా 10 తేదీల్లో రిలీజ్ కానుందని సమాచారం. దీంతో దేవర- బడేడియా చోటే మియా మధ్య కేవలం నాలుగు రోజుల గ్యాప్ కనిపిస్తుంది. ఇది హిందీ మార్కెట్ లో దేవరపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సలార్-డంకీ సినిమాలు ఒక్క రోజు గ్యాప్ లో రిలీజ్ అయితే బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సన్నివేశం కనిపించిందో తెలిసిందే. నార్త్ లో 'సలార్' వసూళ్లు వీక్ గా ఉండటానికి కారణం డంకీ రిలీజ్. ఇప్పుడదే పరిస్థితి అక్షయ్ సినిమా గనుక హిట్ టాక్ తెచ్చుకుంటే కనిపిస్తుందని తెలుస్తుంది

# శ్రీలీల.. మాస్ రూట్లో ఇలా చేస్తే బెటర్?

'పెళ్లి సంద%ణ%' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి హీరోయిన్ చేసిన శ్రీలీల మొదటి సినిమాతోనే అందం అభినయంతో పాటు అదిరిపోయే డాన్సులతో కుర్రకారును ఆకట్టుకుంది. ఆ తర్వాత రవితేజ సరసన 'ధమాకా' సినిమాతో లేటెస్ట్ సెన్సేషన్ గా మారింది. ధమాకా బ్లాక్ బస్టర్ అవడంతో ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు క్యూ కట్టాయి. యంగ్ హీరోలతో పాటు స్టార్ హీరోల సరసన ఛాన్స్ అందుకుంది శ్రీలీల. అలా గత ఏడాది ఏకంగా అరడజనుకి పైగా సినిమాలు చేసింది. కానీ వాటిలో ఎక్కువ శాతం అపజయాలు అందుకోవడం, ఆమె నటించిన సినిమాల్లో అన్ని ఒకే తరహా పాత్రలు చేయడం, ఆడియన్స్ కి విసుగు తెప్పించింది. దానికి తోడు ఏ ఈవెంట్ లో చూసిన ఆమేనే కనిపించడంతో సినీ జనాలకు బోర్ కొట్టేసింది. కానీ ఏ మాటకు ఆ మాట కమర్షియల్ సినిమాలకు శ్రీ లీల పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటివరకు శ్రీ లీల స్క్రిప్ట్ సెలక్షన్ లో తప్పు చేస్తుందని ఆమెను కొంతమంది



విమర్శించారు. అందులో వాస్తవం ఉంది. ఎందుకంటే రీసెంట్ టైమ్స్ లో శ్రీలీలా నటించిన సినిమాల్లో ఆమెకి స్ట్రాంగ్ క్యారెక్టరైజేషన్ లేదు. కానీ కమర్షియల్ సినిమాలకు ఎప్పటికీ ప్లస్ గా మారే మాస్ సాంగ్స్, డాన్సులు చేయడంలో ఆమెను చూసి హీరోలు కూడా స్వయంగా ఇంట్రెస్ట్ చూపించడంతో ఆమె ప్రజెన్స్ మాస్ సినిమాలకు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అలా చూసుకుంటే ధమాకా సినిమా విజయానికి పాటలు, డాన్సులు ప్రధాన కారణం. ఆ తర్వాత 'స్కంద' లో కూడా మాస్ సాంగ్స్ ఆడియన్స్ ని బాగానే ఆకట్టుకున్నాయి. ఆదికేశవ, ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ వంటి సినిమాల్లో మాస్ డాన్స్ నెంబర్స్ ఉన్నప్పటికీ అవి పెద్దగా ప్రభావం చూపలేదు. ఎందుకంటే సినిమా కంటెంట్ రొటీన్ అయిపోవడంతో పాటలు కూడా కాపాడలేకపోయాయి. ఇక ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గుంటూరు కారం' సినిమాలో కుర్చీ మడతపెట్టి మాస్ నంబర్ పెద్ద సెన్సేషన్ అయిందో తెలిసిందే. ఈ పాటలో మహేష్ బాబు, శ్రీలీలా డాన్సులు ఆడియన్స్ ని థియేటర్స్ కి రప్పించాయి. దీంతో బాక్స్ ఆఫీస్ వద్ద ఈ సినిమా భారీ కలెక్షన్స్ అందుకుంది. డాన్స్ మాత్రమే కాదు భగవంత్ కేసరి సినిమాలో శ్రీలీల తన బెస్ట్ పెర్ఫార్మన్స్ తో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేసింది. కాబట్టి ఇక్కడ శ్రీ లీల చేయాల్సింది ఏంటంటే, ఇకనుంచి అయినా స్ట్రాంగ్ క్యారెక్టర్స్ ఉన్న స్క్రిప్ట్ ఎంచుకోవాలి. మంచి స్క్రిప్ట్ ఉండి అందులో శ్రీలీల మాస్ డాన్సులు ఉంటే మినిమం ఆ సినిమా కమర్షియల్ గా సక్సెస్ అవుతుందనే మాట వినిపిస్తోంది.

# బికినీ స్కిన్ షోకి దీపిక పదుకొణే బ్రాండ్ లా!

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణేకి సినిమాల్లో బికినీ ధరించడం కొత్తేం కాదు. ఆమె ఏ సినిమా చేసినా సన్నివేశం బికినీ డిమాండ్ చేసిందంటే? పూర్తిగా దర్శకుల హీరోయిన్ గా మారిపోతుంది. దర్శకుడి తనని ఎలా చూపించాలనుకుంటున్నాడో? అంతకు మించి ఎక్కువగానే హైలైట్ అవుతుంది తప్ప తగ్గడానికి ఛాన్స్ తీసుకోదు. పఠాన్ వరకూ బికినీ సన్నివేశాలు ఏ రోజు ఆమెకి ఇబ్బంది కలిగించలేదు. తొలిసారి 'పఠాన్' లో ధరించిన బికినీ ఎంతటి దుమారం రేపిందో తెలిసిందే. ఏకంగా రెండు రాజకీయ పార్టీల మధ్య నే దీపిక కాషాయ రంగు బికినీ చిచ్చు పెట్టింది. వ్యక్తిగతంగానూ అమ్మడు ఓ పార్టీకి టార్గెట్ అయింది. కొందరి మనోభావాలు దెబ్బ తీసినట్లు గానూ విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ రకమైన



విమర్శలు దీపిక కెరీర్ లో అవే తొలిసారి. ఎప్పుడూ ఎలాంటి వివాదం లేకుండా వెళ్లిపోయే దీపికకి అది బ్యాడ్ ఎక్స్ పీరియన్స్ గా మిగిలిపోయింది. సాధారణంగా ఇలాంటి అనుభవాలు ఎదురైనప్పుడు తదుపరి మళ్లీ అలాంటి సన్నివేశాల్లో నటించా లన్నా? బికినీ ధరించాలన్నా కాస్త ఆలోచించాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. కానీ దీపిక మాత్రం డోంట్ కేర్ అంటూనే దూసుకుపోతుంది. అమ్మడు ప్రస్తుతం హృతిక్ సరసన ఫైటర్ లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో ఓ హాట్ బికినీ ధరించింది. ఆ పాట లో దాదాపు బికినీలోనే ఎక్కువగా హైలైట్ అయింది. మును పెన్నడు కనిపించనంత హాట్ గానూ ఆ బికినీలో రచ్చ చేసింది. ఇప్పటికే ఆ బికినీ సాంగ్ నెట్టింట వైరల్ అవుతోంది. అయితే దీపిక ఇలాంటి బికినీలో ధరించడం సినిమా మార్కెట్ కి ఎంతో కీలకంగా మారుతుందని తెలుస్తోంది. పఠాన్ లో అమ్మడు బికినీ సినిమాకి అదనపు అస్సె ట్ లా నిలిచింది. అందుకే ఫైటర్ యూనిట్ దీపిక-హృతిక్ పై చిత్రీకరించిన బికినీ సాంగ్ ని ప్రత్యే కంగా పాట మొత్తాన్ని రిలీజ్ చేసారు. ఇది కుర్ర కారులో మరింత జోష్ ని పెంచింది. సినిమాని మార్కెట్ లోకి మరింత బలంగా తీసుకెళ్లడానికి దోహద పడుతుంది. మరి అమ్మడు కల్కి 2898 లో కూడా బికినీ ట్రీట్ ఇస్తుందా? అన్నది చూడాలి.




రామమందిరం.. బాలసుందరం.. అయోధ్యలో అంగరంగ వైభవంగా ప్రాణప్రతిష్ఠ

అదిగదిగో అయోధ్యాపురి.. రఘుకుల తిలకుడు ఏలిన నగరం.. జగదభిరాముడి జన్మస్థలం..

# భవ్య మందిరంలో దివ్య తేజస్సుతో బాలరాముడు కొలువుదీరితే పులకించిపోయెను యావత్ భారతం..

అయోధ్య: అయోధ్యలో వందల ఏళ్ల నాటి కలను సాకారం చేస్తూ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రామాలయ ప్రారంభోత్సవం అంబరాన్నంటింది. నవనిర్మిత రామ మందిరంలో నీలమేఘశ్యాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన ఆ మహోన్నత ఘట్టాన్ని వీక్షించి భక్తజనం తమ అంతరంగంలో ఆత్మారాముడిని కొలుచుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రాణప్రతిష్ఠ క్రతువు ప్రారంభమైంది. ప్రధాని మోదీ స్వామివారికి పట్టువస్త్రాలు, వెండి ఛత్రం సమర్పించారు. రామ్‌లల్లా విగ్రహం వద్ద పూజలు చేశారు. 12.29 నిమిషాలకు అభిజిత్ లగ్నంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. స్వామివారికి ప్రధాని మొదటి హారతి సమర్పించారు. అయోధ్య బాలరాముడి దర్శనంతో భారతావని పులకించిపోయింది. ఎడమచేతిలో విల్లు, కుడిచేతిలో బాణంతో స్వర్ణాభరణాలు ధరించి చిరు దరహాసం, ప్రసన్నవదనంతో బాలరాముడు దర్శనమిచ్చారు. ప్రాణప్రతిష్ఠ సమయంలో గగనవీధుల నుంచి ఆలయంపై హెలికాప్టర్లతో పూలవర్షం కురిపించారు. ఈ క్రతువుల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్, యూపీ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. ప్రాణప్రతిష్ఠకు ముందు పుజాసామాగ్రితో ఆలయంలోకి ప్రవేశిస్తోన్న వీడియోను మోదీ షేర్ చేశారు. 'ఈ దివ్యవేడుకలో భాగమైనందుకు నాకు అంతులేని ఆనందంగా ఉంది' అని ఉద్వేగానికి గురయ్యారు.

**రామనామంతో మార్మోగిన అయోధ్య..** రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అయోధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నగరం మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఎటు చూసినా రామనామ స్మరణతో మార్మోగింది. నగరమంతా రామ్ లీల, భగవద్గీత కథలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**అపురూప క్షణాలను వీక్షించిన ప్రముఖులు..** ఈ మహత్కార్యానికి దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది విచ్చేశారు. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు ప్రాణప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు. తెదేపా అధినేత చంద్రబాబు, సినీ, క్రీడా ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి దంపతులు, రామ్ చరణ్, అమితాబ్‌బచ్చన్, విక్కీ కౌశల్, అభిషేక్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, కత్రినా కైఫ్, అనుపమ్ ఖేర్, రాజ్‌కుమార్ హిరానీ, రిషభ్ శెట్టి, సచిన్ తెందూల్కర్, అనిల్ కుంబ్లే, సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పారిశ్రామికవేత్తలు ముఖేశ్ అంబానీ దంపతులు, కుమార మంగళం బిర్లా, అనన్య బిర్లా, అనిల్ అంబానీ, ఆకాశ్, శ్లోకా, ఈశా అంబానీ, ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్, యోగా గురువు రాందేవ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయానికి ఆహ్వానం అందలేదు.. వీహెచ్ విసుర్లు



భద్రాద్రి కొత్తగూడెం: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం గురించి కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంత రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సభ్యులు భద్రాచలం ఆలయ నిర్వాహకులను ఆహ్వానించలేదని మండిపడ్డారు. భద్రాద్రి రాములోరి ఆలయంపై వివక్ష ఎందుకు చూపారో అర్థం కావడం లేదన్నారు. దేవుని వద్ద రాజకీయాలు తగవని ఆయన సూచించారు. అయోధ్య తర్వాత అంతటి చరిత్ర కలిగిన దేవస్థానం భద్రాచలం అని వీహెచ్ గుర్తుచేశారు. భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా పిలుస్తారని వెల్లడించారు. అలాంటి స్వామివారిని అయోధ్య ఆలయ ట్రస్ట్ సభ్యులు మరచిపోవడం సరికాదన్నారు. భద్రాద్రి ఆలయానికి ఆహ్వానం రాకపోవడానికి కారణం ఉందని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని వీహెచ్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతోనే భద్రాద్రి రాములోరికి ఆహ్వానం అందలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్ సభ్యులు కావాలనే ఆహ్వానించలేదని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సూచనల మేరకే ట్రస్ట్ సభ్యులు అతిథులను ఆహ్వానించారని పేర్కొన్నారు.

భద్రాద్రి రాములోరిని అయోధ్య ట్రస్ట్ సభ్యులు పిలవలేదని వీహెచ్ చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఉహించుకోండి



హైదరాబాద్, జనవరి 22: పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం లేకపోవడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు మొదలవుతాయన్నారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టలేకపోయామన్నారు. కాంగ్రెస్ అభూత కల్పనలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని విమర్శించారు. తాము ఇంకా మాట్లాడటం మొదలు పెట్టనే లేదు.. కాంగ్రెస్ వాళ్ళు ఉలిక్కి పడుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఉహించుకోవాలన్నారు. హామీలకు కాంగ్రెస్ పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తోందని, అయినా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్ రెడ్డి అడ్డమైన మాటలు చెప్పారని మండిపడ్డారు. కార్యకర్తలు ఉదాసీన వైఖరిని, మీమాంసను వీడాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఏం మాట్లాడారు.. ఇప్పుడేం చేస్తున్నారో ప్రజలకు విడమరచి చెప్పాలని సూచించారు. కోమటి రెడ్డి గత నవంబర్‌లోనే కరెంటు బిల్లులు కట్టవద్దని చెప్పారన్నారు. నల్లగొండ ప్రజలు బిల్లులు కట్టకుండా కోమటి రెడ్డికే పంపించాలన్నారు. సాగర్ ఆయకట్టుకు కాంగ్రెస్ పాలనలో మొదటి సారి క్రాప్ హాలీడే ప్రకటించే దుస్థితి దాపురించిందన్నారు.

కృష్ణా రివర్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ జుట్టును కాంగ్రెస్ కేంద్రం చేతిలో పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరాం సాగర్ చివరి ఆయకట్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ బంధం నల్లగొండ మున్సిపాలిటీ అవిశ్వాసంలో బయట పడిందన్నారు. రేవంత్ భుజం మీద తుపాకీ పెట్టి మోడీ బీఆర్ఎస్‌ను కాలుస్తారట అంటూ వ్యాఖ్యలు చేశారు. మైనారిటీ సోదరులకు కాంగ్రెస్ – బీజేపీ అక్రమ సంబంధం గురించి చెప్పాలన్నారు. అదానీని రాహుల్ దొంగ అన్నారని.. రేవంత్ దొర అంటున్నారని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

# సీఎం, మంత్రులు సోయి తప్పి మాట్లాడుతున్నారు

హైదరాబాద్: ముఖ్యమంత్రి, మంత్రులు అధికారంలో ఉన్నామన్న సోయి తప్పి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును ప్రశ్నిస్తే ఆ పార్టీ నేతలకు అసహనం పెరుగుతోందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఎప్పుడేం మాట్లాడుతారో ఆయనకు తెలియదని విమర్శించారు. నవంబర్ నుంచి విద్యుత్ బిల్లులు కట్టొద్దని కోమటిరెడ్డి చెప్పిన విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారన్నారు. కేటీఆర్ నిజం చెబితే కోమటిరెడ్డి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కోమటిరెడ్డిని కాంగ్రెస్‌లోనే కోవర్టు అని.. ఆ పార్టీ నేతలే అంటారని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అయిన తన తమ్ముడికి ఓట్లేయమని చెప్పింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆయన బీఆర్ఎస్‌ను 39 ముక్కలు చేస్తానని అంటున్నారని.. బీఆర్ఎస్‌ను అంతం చేయడం ఎవరి తరం కాదని చెప్పారు. కోమటిరెడ్డి అధికారిక రివ్యూకి వెళ్లి అనవసర విషయాలు మాట్లాడారన్నారు. యూరియా కోసం రైతులు క్యూ లైన్లో చెప్పులు పెట్టే పాత రోజులు మళ్ళీ వచ్చాయని గుర్తుచేశారు. రైతుబంధు ఇంకా రాకపోవడంపై అన్నదాతల్లో ఆందోళన ఉందన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చింది పార్టీలను చీల్చడానికి కాదని.. ప్రజలే కాంగ్రెస్‌ను త్వరలో చీల్చి చెండాడుతారని హెచ్చరించారు. నిరసనలకు తాము తొందర పడటం లేదు.. ప్రజలే సమస్యలపై రోడ్లపైకి వచ్చి నిరసన చేపడుతున్నారని జగదీష్ రెడ్డి అన్నారు.

# రాష్ట్రపతి ఎట్‌హోంకు నెల్లుట్ల సర్పంచ్



జనగామ: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ సర్పంచ్ చిట్ల స్వరూపారాణికి అరుదైన అవకాశం లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చే ఎట్ హోం తేనేటి విందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ విభాగం నుంచి తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. 2021-22 సంవత్సరానికి నీటి సమృద్ధి విభాగంలో నెల్లుట్ల పంచాయతీకి జాతీయ పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఏప్రిల్ 17న నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ స్వరూపారాణి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ క్రమంలోనే సర్పంచ్ స్వరూపారాణికి ఎట్ హోమ్‌కు ఆహ్వానం అందింది. దేశ వ్యాప్తంగా కేవలం ఎనిమిది మంది సర్పంచ్‌లకే ఈ అవకాశం దక్కగా.. అందులో రాష్ట్రం నుంచి నెల్లుట్ల సర్పంచ్‌కు స్థానం దక్కడం విశేషం.



# థేమ్స్ మోడల్లో మూసీనది ప్రక్షాళన సాధ్యమేనా ?

హైదరాబాద్ : నగరంలో ఉన్న మూసీ నదిని ప్రక్షాళన చేసి మంచినీటి వాడకానికి పనికొచ్చేట్లు చేస్తామని కేసీయార్ ప్రభుత్వం చాలాసార్లు ప్రకటించింది. ఒకపుడు మంచినీటిని సరఫరా చేసిన మూసీనది కాలక్రమంలో చాలా అసహ్యంగా తయారైంది. నది ఆనకట్టలు ఆక్రమలకు గురికావటంతో నది వైశాల్యం కుచించుకుపోయింది. నగరానికి మంచినీటి సరఫరాకు మూసీనదితో పాటు హిమాయత్ సాగర్, హుస్సేన్ సాగర్ లాంటివి వచ్చాయి. దాంతో మూసీనది ప్రాధాన్యత తగ్గిపోయింది. దానికితోడు అతివృష్టి, అనావృష్టి కారణంగా మూసీనది ఆక్రమణలకు గురయ్యింది. అప్పటినుండి మూసీనది కేవలం ప్రచారానికి మాత్రమే పనికొస్తోంది. కేసీయార్ హయాంలో మూసీనది ప్రక్షాళనకు చాలా ప్లాన్లు వేశారు కానీ ఏదీ అమల్లోకి రాలేదు. అనేక రూపాల్లో కోట్ల రూపాయలు మాత్రం ఖర్చయిపోయింది. ఇలాంటి మూసీనదిని ప్రక్షాళన చేయటానికి ఇపుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాగా ఆసక్తి చూపుతోంది. లండన్ పర్యటనలో ఉన్న రేవంత్ బృందం థేమ్స్ నది నిర్వహణ అధికారులతో భేటీ అయ్యారు. రివర్ అథారిటి, లండన్ పోర్టు నిర్వహణ యాజమాన్యం, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మూసీనది ప్రక్షాళన ద్వారా కాలుష్య నివారణ, టూరిజం డెవలప్మెంట్ తో పాటు మంచినీటి సరఫరాను ఏకకాలంలో చేయాలని రేవంత్ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టింది. థేమ్స్ నది నిర్వహణలోని కష్ట, నష్టాల వివరాలను రేవంత్ అండ్ కో అడిగి తెలుసుకున్నారు. మూసీనది ప్రస్తుత పరిస్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీనదిని డెవలప్ చేయటం కోసం లండన్ అధికారులకు అవగాహన కోసమే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అయిపోయిన తర్వాత తొందరలోనే తాము హైదరాబాద్ వచ్చి ఫీల్డ్ విజిట్ చేస్తామని థేమ్స్ రివర్ నిపుణులు హామీ ఇచ్చారు. నిజంగానే మూసీనదిని ప్రక్షాళన చేస్తే నగరానికి చాలా మంచి జరుగుతుందనటంలో సందేహంలేదు. కానీ అది సాధ్యమేనా అన్నదే పెద్ద పాయింట్. ఎందుకంటే నదికి రెండువైపులా కిలోమీటర్ల కొద్ది ఆక్రమణలు జరిగిపోయాయి. ఈ ఆక్రమణల్లో అన్నీ పార్టీల నేతలూ ఉన్నారు. నదిని ప్రక్షాళన చేయాలంటే ముందుగా ఆక్రమణలను క్లియర్ చేయాలి. అప్పుడు నది విశాలమవుతుంది. అప్పుడు నీళ్ళొచ్చినపుడు ప్రక్షాళన మొదలుపెట్టాలి. మరి చివరకు ఏమవుతుందో చూడాలి.

# కేటీయార్‌కు షాకిచ్చిన క్యాడర్



హైదరాబాద్ : మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన దగ్గర నుండి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీయార్ కు షాకులు తగులుతునే ఉన్నాయి. తొందరలోనే జరగోబోయే పార్లమెంటు ఎన్నికలకు పార్టీ సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నది. ఈ సమావేశాలను కేటీయారే చూసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తనదే బాధ్యతగా కేటీయార్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో అప్పటినుండి సమావేశాల్లో కేటీయార్ ను నేతలు ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నారు. ఇపుడావంతు క్యాడర్ తీసుకున్నట్లుంది. తెలంగాణా భవన్లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల నేతలు, క్యాడర్ తో కేటీయార్ సమావేశమయ్యారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు విషయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కేటీయార్ మాట్లాడారు. అయితే ఆయన మాటలను క్యాడర్ మధ్యలోనే కట్ చేసేశారట. ఇలాంటి మాటలు పదేళ్ళపాటు చెప్పిచెప్పి పార్టీని ముంచేశారంటు తీవ్రంగా మండిపడ్డారట. పార్టీ పెట్టిన దగ్గర నుండి కష్టపడిన తమకు పదవులు ఎందుకు ఇవ్వలేదని కేటీయార్ ను నిలదీశారని సమాచారం. ఉద్యమంతో ఎలాంటి సంబంధంలేని ఇతర పార్టీల నేతలను తీసుకొచ్చి అందలం ఎక్కించారని తీవ్రంగా ఆక్షేపించారట. కష్టపడిన తమను మంత్రులుగా పనిచేసిన వారు ఎవరూ కనీసం దగ్గరకు కూడా రానీయలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారట. అధికారంలో ఉన్నపుడు గుర్తుకురాని ద్వితీయశ్రేణి నేతలు క్యాడర్ ఇపుడు మాత్రం గుర్తుకు వచ్చారా అంటు కేటీయార్ ను నిలదీశారట. ఇతర పార్టీల నుండి తీసుకొచ్చి అందలాలు ఎక్కించిన వారితోనే పనిచేయించుకుని పార్లమెంటు సీట్లు గెలిపించుకోండని కూడా క్యాడర్ గట్టిగానే చెప్పినట్లు పార్టీలో టాక్. కేటీయార్ ను అనాల్సిన అనేసి, చెప్పాల్సినవి చెప్పేసిన క్యాడర్లో చాలామంది సమావేశాల మధ్యలోనే బయటకు వెళ్ళిపోయారట. బయటకు వెళుతున్న వాళ్ళని వారించాలని కేటీయార్ ఎంత ప్రయత్నించినా వినిపించుకోలేదని సమాచారం. దాంతో అవమానంగా భావించిన కేటీయార్ కూడా సమావేశంలో కూర్చోవటం ఇష్టంలేని వెళ్ళిపోవచ్చని గట్టిగానే చెప్పారట. దాంతో మిగిలిన వాళ్ళు కూడా వెళ్ళిపోయారని తెలిసింది. ఖమ్మం, భద్రాచలం నుండి వచ్చిన నేతలు, క్యాడర్ ఉదయం వచ్చి సాయంత్రం వరకు వెయిట్ చేశారని అలాంటిది సిటీలోనే ఉండే మీకు వెయిట్ చేయటానికి ఏమొచ్చిందని కేటీయార్ కూడా మండిపడ్డారట. అయితే కేటీయార్ మాటలను పట్టించుకోకుండా చాలామంది వెళ్ళిపోయారట.

# ఏపీ టూర్లో కార్పొరేటర్లు.. తెలంగాణలో మేయర్ సీటుకి ఎసరు!



మేడ్చల్ : తెలంగాణలో ప్రభుత్వం మారింది. దీంతో పలు చోట్ల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పార్టీలు మారుతున్నారు. దీంతో చాలా లెక్కలు మారిపోతున్నాయి. ఇందులో భాగంగా... పురపాలక, నగరపాలక సంస్థల్లో ఇప్పటి వరకు బీఆరెస్స్ పార్టీకి చెందిన వారు మేయర్లుగా, మున్సిపల్ ఛైర్మన్లుగా ఉండగా.. వారిపై ఇప్పుడు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారు. మాజీ మంత్రులు, బీఆరెస్స్ కీలక నేతల బుజ్జగింపులు సైతం ఇప్పుడు వర్కవుట్ కావడం లేదు. అవును... ఇటీవల నల్గొండ మున్సిపాలిటీ ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ చేజిక్కించుకున్నట్లుగానే మరికొన్ని చోట్ల ఆ పరంపర కొనసాగుతున్నట్లుంది! ఇందులో భాగంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ నగరపాలక సంస్థలో మేయర్ మేకల కావ్యపై పలువురు తాజాగా మరోసారి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల ముందే 19 మంది కార్పొరేటర్లు మేయర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం.. మేడ్చల్ కలెక్టర్ కు ఈ విషయంపై తీర్మానం ఇచ్చారు. అయితే... నాడు రాజకీయ ఒత్తిళ్లు, అసెంబ్లీ ఎన్నికలు మొదలైన కారణాలతో ఆ తీర్మానానికి సంబంధించిన వ్యవహారం ముందుకు కదల్లేదు. ఈ సమయంలో మరోసారి ఈ విషయమై కలెక్టర్ ను కలిశారు కార్పొరేటర్లు. ఇందులో భాగంగా వీలైనంత తొందరగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో... కలెక్టరేట్ నుంచి కార్పొరేషన్ కు సంబంధిత ఆదేశాలు వచ్చాయి. దీంతో... మరో 2 రోజుల్లో అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ క్రమంలో ఆదివారం క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. ఇందులో భాగంగా అవిశ్వాస తీర్మానం ఇచ్చిన 19 మంది కార్పొరేటర్లతో ఏపీలోని బాపట్లకు విహారయాత్రకు బయలుదేరి వెళ్లారని తెలుస్తుడీ. నిధుల కేటాయింపులో తమతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా మేయర్ ఒంటెద్దుపోకడలకు పోతున్నారంటూ వీరంతా అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. మరోపక్క ఈ 19 మంది కార్పొరేటర్లను కలిసేందుకు మేయర్ కావ్య తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలితం లేదని తెలుస్తుంది. అవిశ్వాస తీర్మానం ఇచ్చిన ఈ కార్పొరేటర్లంతా త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. కాగా... జవహర్ నగర్ నగర పాలక సంస్థలో మేయర్ మేకల కావ్య సహా 28 మంది సభ్యులున్నారు. వీరిలో 19మంది ఇప్పుడు ఎర్రజెండా ఎగరేశారు!

# 'ధరణి' సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం: రేమండ్ పీటర్




హైదరాబాద్: 'ధరణి'లో ఉన్న సమస్యలను అర్థం చేసుకుంటున్నామని.. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ధరణి కమిటీ సభ్యుడు రేమండ్ పీటర్ తెలిపారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ధరణి' లొసుగులపై చర్చిస్తున్నామని.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన సమస్యలపై కొంతమంది కలెక్టర్లతో సమావేశం అవుతామన్నారు. మీ సేవలో ఉన్న సమస్యలు, అగ్రికల్చర్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కూడా సమావేశం అవుతామని చెప్పారు. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి చాలా సమయం పడుతుందని అన్నారు. నివేదిక వచ్చాక ప్రభుత్వం 'ధరణి'పై స్పందిస్తుందని రేమండ్ పీటర్ తెలిపారు.

**'ధరణి' సమస్యలపై చాలామంది కోర్టుకి వెళ్లారు: సునీల్ –** 'ధరణి' కమిటీ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయదు.. మార్పులు, చేర్పులు, సలహాలు ఇస్తుందని ధరణి కమిటీ సభ్యులు సునీల్ తెలిపారు. ఇందులో ఉన్న ప్రాబ్లెమ్స్ అన్నింటిని జిల్లా పరిధిలో పరిష్కరిస్తామని చెప్పారు. ధరణి ఒక్కటే సమస్య కాదని... ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులతో కూడా చర్చించాలని అన్నారు. ప్రతి రాష్ట్రంలో భూముల వివరాలను కంప్యూటర్లలో రికార్డుల్లోకి ఎక్కించారన్నారు. 'ధరణి' సమస్యలపై చాలామంది కోర్టుకి వెళ్లారన్నారు. రైతుకు భూమి ఉండి.. రికార్డులో భూమిని నమోదు చేయకపోతే వారు చాలా ఇబ్బంది పడుతున్నారని సునీల్ చెప్పారు.

**మధ్యంతర కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఇస్తుంది: కోదండరెడ్డి –** మధ్యంతర కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఇస్తుందని ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి అన్నారు. లక్షల మంది రైతులు భూమికి సంబంధించిన పాసు బుక్కులు లేకపోవడంతో వారికి లబ్ధి చేకూరడం లేదన్నారు. చట్టాల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు, మూడు అంచెలుగా 'ధరణి' కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందని కోదండరెడ్డి అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com